
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి



భద్రాద్రి కొత్తగూడెం

ఉష్ణోగ్రత ఖమ్మం : గరిష్ఠం 34 । కనిష్ఠం 21 | భద్రాద్రి : గరిష్ఠం 36 । కనిష్ఠం 25 సోమవారం, 19 ఫిబ్రవరి 2024



పగిడిద్దరాజును దర్శించుకున్న మేడారం ట్రస్ట్‌బోర్డ్ చైర్మన్ అరెం లచ్చుపటేల్



- రహదారులు, ఇసుక క్వారీల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు నిర్ణయం
- ఏపీ నుంచి అక్రమంగా తరలించకుండా పటిష్ఠ చర్యలు
- సరిహద్దు చెక్‌పోస్టుల్లో రెవెన్యూ, పోలీసు సిబ్బంది నియామకం

ఇసుక అక్రమాలపై సీసీ నిఘా

తెలంగాణ-ఆంధ్రా సరిహద్దుల నుంచి గోదావరి ఇసుక అక్రమరవాణాను నివారించేందుకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధికార యంత్రాంగం చర్యలు చేపట్టింది. ఇటీవల భద్రాచలం సమీపంలోని ఏపీ నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న 17లారీలను పట్టున్న వ్యవహారంలో సదరు లారీలను విడిపించేందుకు రాష్ట్రానికి చెందిన ఓ మంత్రి పీఏ, మరో మంత్రి అనుచరుడు ప్రయత్నించడంతో ఈ ఇసుక దందా వ్యవహారం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాశమైంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ అధికారుల్లో కదలిక మొదలైంది.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, ఖమ్మం



భద్రాద్రి జిల్లా బూర్గంపాడు మండలం మోరంపల్లి బంజర వద్ద అటవీశాఖ చెక్‌పోస్టులో పోలీసు, రెవెన్యూ సిబ్బంది

ఏపీ నుంచి వచ్చే గోదావరి ఇసుకపై భద్రాద్రి జిల్లాలో నిఘా పెంచుతున్నారు. అందులో భాగంగా సరిహద్దు రహదారుల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేస్తున్నారు. అటవీశాఖతోపాటు పలు శాఖల చెక్‌పోస్టులనే టీఎస్ఎండీసీ చెక్‌పోస్టులుగా వినియోగిస్తున్నారు. ఆయా చెక్‌పోస్టుల్లో పోలీసు, రెవెన్యూ సిబ్బందిని విధుల్లో ఉంచుతున్నారు. రాష్ట్ర మైనింగ్ శాఖ కమిషనర్ ఇప్పటికే జిల్లా కలెక్టర్లకు, ఎస్పీలకు, సీపీలకు ఇసుక అక్రమరవాణ నివారణ చర్యలకు మైనింగ్, టీఎస్ఎండీసీ సిబ్బంది కొరత ఉన్నందున పోలీసు, రెవెన్యూ సిబ్బందిని కూడా నియమించి తనిఖీ చర్యలు చేపట్టాలని చెక్‌పోస్టుల వద్ద నిఘా చర్యలకు సహకరించాలని లేఖ ద్వారా విజ్ఞప్తి చేశారు.

పేరుకే గిరిజన సొసైటీలు..

గిరిజన సొసైటీల పేరుతో ఏజెన్సీ ప్రాంతంలో గోదావరి ఇసుక తవ్వకాలకు అనుమతులు తీసుకుని వాటి నిర్వాహణ బాధ్యతలను గిరిజనేతర ఇసుక కాంట్రాక్టర్లకు అప్పగిస్తున్నారు. దీంతో భారీ పొక్లెయిన్లతో గోదావరి నుంచి ఇసుక తవ్వి మైదాన ప్రాంతానికి తరలించి అక్కడ లాట్లు పోసి టీఎస్ఎండీసీ పర్మిట్లతోనూ మరికొన్ని రాత్రి వేళ దొంగపర్మిట్లతోనూ తరలిస్తున్నారు. పేరు గిరిజనుల సొసైటీలదే అయినా పెత్తనం అంతా గిరిజనేతరులదే.. రాజకీయ పార్టీల నాయకులదే. ఈ పరిస్థితిని గ్రహించిన భద్రాద్రి, ఖమ్మం జిల్లాల అధికారులు ప్రధాన రహదారులతో పాటు రాష్ట్ర సరిహద్దులు, ఇసుక తవ్వకాలు జరిగే ప్రదేశాల్లోనూ సీసీ కెమెరాలు ఏర్పాటుచేసి మొత్తం ఇసుక రవాణాను పర్యవేక్షించాలని నిర్ణయించారు. భద్రాచలం వెలుపల ఏపీ సరిహద్దులోని గుండాల, కొల్లుగూడెం, కుక్కునూరు, వేలేరుపాడు తదితర మండాలల నుంచి ఇసుక రవాణా జరుగుతోంది. దాంతో అక్రమంగా రాష్ట్రంలోకి ఇసుక రవాణా జరగకుండా సీసీ కెమరాల ద్వారా నిఘా పెంచబోతున్నారు. ఖమ్మం జిల్లా పరిధిలో నందిగామ ప్రాంతం నుంచి వచ్చే కృష్ణానది ఇసుకతో పాటు మున్నేరు ఇసుకను కూడా అడ్డుకునేందుకు మధిర, బోనకల్, వల్లభి ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటుచేయాలని మైనింగ్ అధికారులకు ఆదేశాలు అందాయి. మరోవైపు ఏజెన్సీ ప్రాంతంలో ఐటీడీఏ పీవో కూడా గిరిజన సొసైటీల నిర్వాహణ, ఇసుక వ్యాపారం జరుగుతున్న తీరుపైనా అక్కడ జరుగుతున్న అక్రమాలపై కఠిన చర్యలు తీసుకునేందుకు రంగం సిద్ధం చేస్తున్నట్టు తెలిసింది.

కెమెరాలు లేకపోవడంతోనే దందా..

భద్రాచలం బ్రిడ్జితోపాటు అటు వాజేడు ఏటూరునాగారం బ్రిడ్జి, మణుగూరు, పినపాక మండలాల్లోని ఆర్అండ్‌బీ రహదారులపైనా పాల్వంచ సమీపంలోనూ చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. అయితే ఆయా చెక్‌పోస్టులో ఇప్పటి వరకు ఎక్కడా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయలేదు. సీసీ కెమెరాల నిఘా లేకపోవడాన్ని ఆసరాగా చేసుకుని కొంతమంది ఇసుక వ్యాపారులు, లారీ యజమానులు, అధికారపార్టీ నేతలు ఇసుకదందాలో భాగస్వాములవుతున్నారు. గత ప్రభుత్వంలో జిల్లాకు చెందిన లారీ యజమానుల సంఘం నాయకుడు భారీగా అప్పటి ప్రభుత్వ పలుకుబడితో ఇసుక అక్రమ రవాణా సాగించాడు. మళ్లీ ఇప్పుడు కూడా ఇసుక వ్యాపారంలో కొందరు అధికార పార్టీ నేతలు తెరవెనుక చక్రం తిప్పుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మణుగూరు ప్రాంతంలో గిరిజన సొసైటీల పేరుతో కొందరు గిరిజనేతర ఇసుక వ్యాపారులు తమ పలుకుబడి ఉపయోగించి ఇసుక క్వారీలనుంచి ఇసుక రవాణా చేస్తున్నారు.

మేడారానికి నేడు
పగిడిద్దరాజు పయనం

గుండాల, ఫిబ్రవరి 18: వన దేవత సమ్మక్క భర్త, భద్రాద్రి జిల్లా గుండాల మండలం యాపలగడ్డలోని అరెం వంశీయుల ఇలవేల్పు పగిడిద్దరాజు మేడారం మహోత్సవానికి పయనమవుతున్నాడు. అరెం వంశీయులు పగిడిద్దరాజుతో సోమవారం మేడారానికి పయనమవుతున్నారు. గుండాల మండలంలోని యాపలగడ్డ గ్రామం నుంచి మేడారం జాతరకు కాలినడకన పగిడిద్దరాజును తీసుకెళ్తారు. రెండేళ్లకొకసారి ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని మేడారంలో నిర్వహించే సమ్మక్క-సారక్క జాతర సమ్మక్క భర్త పగిడిద్దరాజు వెళితే ప్రారంభమవుతుంది. సోమవారం యాపలగడ్డలోని పగిడిద్దరాజు గర్భగుడి వద్ద పడగలకు(జెండాలకు), శివసత్తులకు, పురాతన కాలం నాటి ఆభరణాలకు పూజారులు, వడ్డెలు ప్రత్యేకపూజలు నిర్వహిస్తారు. అనంతరం స్థానిక గద్దెల వద్దకు డోలీ చప్పుళ్లతో తీసుకువెళ్లి పూజలు చేస్తారు. గ్రామం మీదుగా గిరిజన నృత్యాలతో, డప్పు వాయిద్యాల నడుమ ఊరేగింపుగా తీసుకెళ్లనున్నారు. రెండు రోజుల పాటు పాదయాత్ర చేసి జాతర ముందురోజు జంపన్న వాగులో బస చేస్తారు. బుధవారం రోజున మేడారంలోని పగిడిద్దరాజు గద్దెపై ప్రతిష్ఠిస్తారు. గురువారం సమ్మక్కను చిలకలగుట్ట నుంచి గద్దెలకు తీసుకురావడంతో నిండు జాతర ప్రారంభమవుతుంది.

పగిడిద్దరాజును దర్శించుకున్న మేడారం జాతర ట్రస్ట్ బోర్డ్ చైర్మన్

సమ్మక్క భర్త, అరెం వంశీయుల ఇలవేల్పు పగిడిద్దరాజును యాపలగడ్డలో మేడారం ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ అరెం లచ్చుపటేల్ ఆదివారం దర్శించుకున్నారు. పూజారులు, వడ్డెల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మేడారం జాతర అనంతరం మార్చి మొదటి వారంలో యాపలగడ్డలో జరిగే పగిడిద్దరాజు జాతర నేపథ్యంలో చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీరాజ్ శాఖ మంత్రి, ములుగు ఎమ్మెల్యే సీతక్క పగిడిద్దరాజు జాతర అభివృద్ధికి రూ.16 లక్షలు మంజూరు చేశారని తెలిపారు. ఆ నిధులతో మరుగుదొడ్లు, బోరు, గర్భగుడి అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. పగిడిద్దరాజు జాతర అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో అరెం కాంతారావు, అబ్బయ్య, నాగయ్య, సత్యం, రమణ, రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఒకే ఒక్కడు

- హెచ్ఎంకు ఐదు అదనపు బాధ్యతలు
- రెండు మండలాలకు ఎంఈవో, మూడు గ్రామాలకు ప్రత్యేక అధికారి

7

బతుకు చితుకుతోంది

- బీటీపీఎస్ రైల్వేట్రాక్ నిర్వాసితులుగా గుర్తించాలి
- మణుగూరు వ్యాపారుల వినతి

8

- పోడుసాగు విషయంలో ఎలాంటి కేసులుండవు
- గిరిజన రైతులకు సబ్సిడీపై విద్యుత్ మోటార్లు
- నవమి నాటికి భద్రాచలం వద్ద రెండో వారధి పూర్తి
- డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు తుమ్మల, కోమటిరెడ్డి
- భద్రాచలంలో ఐటీడీఏ పాలకమండలి సమావేశం

గిరిజనుల విద్య, వైద్యానికి
ప్రత్యేక ప్రణాళికలు

భద్రాచలం, ఫిబ్రవరి 18: గిరిజనలకు మేలు జరిగేలా విద్య, వైద్య రంగాలను మరింతగా బలోపేతం చేస్తామని డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకటరెడ్డిలు పేర్కొన్నారు. భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయంలో జరిగిన ఐటీడీఏ పాలక మండలి సమావేశంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ గిరిజనుల జీవన స్థితిగతులను పెంచేందుకు విద్య, వైద్య రంగాలను మరింతగా అభివృద్ధి చేస్తామన్నారు. గిరిజన గ్రామాల్లో ఇకపై పోడు సాగుదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు. గ్రామాల్లోని పీహెచ్‌సీల్లో వైద్యులు, ఏఎన్ఎంల, అంబులెన్స్ కొరత ఉన్నట్లు తమ దృష్టికి వచ్చిందని, త్వరలోనే మారుమూల పీహెచ్‌సీల్లోనూ సరిపడా వైద్య సిబ్బందిని నియమిస్తామని తెలిపారు. రాష్ట్రంలో ఐటీడీఏల అభివృద్ధికి అన్నిరకాల చర్యలు తీసుకుంటామన్నారు. ఇందిర జలప్రభ కార్యక్రమంలో భాగంగా గిరిజన రైతులకు సబ్సిడీపై విద్యుత్ మోటార్లు అందిస్తామన్నారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు వేతన బకాయిలు త్వరలోనే చెల్లిస్తామన్నారు. గిరిజన గ్రామాల్లో ఉన్న ప్రజా ప్రతినిధులు, ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ జిల్లా అధికారుల సమన్వయంతో గిరిజన ప్రాంతాల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.

నవమి నాటికి భద్రాచలం రెండో వారధి పూర్తి

భద్రాచలం వద్ద గోదావరిపై నూతనంగా నిర్మిస్తున్న రెండో వారధి పనులు శ్రీరామనవమి నాటికి పూర్తి చేస్తామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు. ఇందుకోసం కేంద్ర మంత్రి నితిన్‌గడ్కరీతో రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడి నిధులు మంజూరయ్యేలా కృషి చేశారని తెలిపారు. భద్రాచలానికి వరద గండం లేకుండా కరకట్ట నిర్మాణం చేపడతామన్నారు. అశ్వాపురం మండలం పూసుకుంట, గోగులపూడి గ్రామాల్లో ఉన్న కొండరెడ్ల కుటుంబాల బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. గిరిజన గ్రామాల్లో రోడ్లు, విద్యార్థుల కోసం రెసిడెన్షియల్ పాఠశాలలు, ఆశ్రమ పాఠశాలల్లో అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తామన్నారు. నియోజకవర్గాల వారీగా ఎమ్మెల్యేలు వారి పరిధిలోని గిరిజన గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.



మహిళా సంఘాలకు చెక్కు అందజేస్తున్న దృశ్యం



సమావేశంలో మాట్లాడుతున్న భట్టి, వేదికపై మంత్రులు తుమ్మల, వెంకటరెడ్డి

ఐటీడీఏ ద్వారా వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రాలు

గిరిజన యువత వారి కుటుంబాలను పోషించడానికి జిల్లా సెల్ఫ్ ఎంప్లాయ్‌మెంట్, ఐటీడీఏ వైటీసీ ద్వారా వివిధ రకాల వృత్తి నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తామని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. వృత్తి నైపుణ్యాభివృద్ధి కేంద్రాల్లో న్యాక్ ద్వారా నిష్ణాతులైన ఫ్యాకల్టీతో శిక్షణ ఇప్పిస్తామని పేర్కొన్నారు. భద్రాచలం, మధిర, కొత్తగూడెం, ఖమ్మం, ఇల్లెందుల్లో నూతనంగా వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. జిల్లా అభివృద్ధికి త్వరలో నిధులు విడుదల చేస్తామని ఆ నిధులతో గిరిజన గ్రామాల అభివృద్ధితో పాటు నిరుద్యోగ గిరిజన యువతి యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించవచ్చన్నారు. అనంతరం ఐటీడీఏ పీవో ప్రతీక్‌జైన్ మాట్లాడుతూ ట్రైకార్ ద్వారా 80 శాతం సబ్సిడీపై రుణాలకు వెసులుబాటు కల్పిస్తామన్నారు. అలాగే ట్రైకార్ ద్వారా 2020-21 సంవత్సరానికి 330 స్కీములకు గాను 228 గ్రౌండ్ చేశామన్నారు. ప్రతి యూనిట్‌కు 80శాతం సబ్సిడీపై రుణాలు అందిస్తామని తెలిపారు. అనంతరం ట్రైకార్ ద్వారా ఎంఎస్ఎంఈ పథకం కింద రూ.1.29 కోట్లసబ్సిడీతో చెక్కును లబ్ధిదారులకు మంత్రులు అందజేశారు. సమావేశంలో మహబూబాబాద్ ఎంపీ మాలోతు కవిత, ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు, కోరం కనకయ్య, జారె ఆదినారాయణ, రాందాస్ నాయక్, డాక్టర్ తెల్లం వెంకట్రావు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, ఖమ్మం, భద్రాద్రి జిల్లాల కలెక్టర్లు వీపీ గౌతమ్, డాక్టర్ ప్రియాంక ఆలా పాల్గొన్నారు.

'గూడెం'లో గరంగరం!



- కొత్తగూడెం మునిసిపల్ చైర్‌పర్సన్‌పై నేడు అవిశ్వాస ఓటింగ్
- క్యాంపుల నుంచి నేరుగా సమావేశానికి రానున్న కౌన్సిలర్లు
- 36మందిలో 24మంది హాజరైతేనే కోరం పూర్తి

కొత్తగూడెం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి జిల్లా కొత్తగూడెం మునిసిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మీపై పెట్టిన అవిశ్వాస తీర్మానంపై సోమవారం ఓటింగ్ నిర్వహించనున్నారు. బీఆర్ఎస్‌కు చెందిన మున్సిపల్ కౌన్సిలర్లు రెండు వర్గాలుగా విడిపోయి కొందరు చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం ప్రకటిస్తూ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు అవిశ్వాస పరీక్ష నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. కొత్తగూడెం మునిసిపాలిటీలోని సమావేశ మందిరంలో ఓటింగ్ నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. అవిశ్వాస పరీక్షను నెగ్గేందుకు రెండు వర్గాలకు చెందిన నాయకులు తమకు అనుకూలమైన కౌన్సిలర్లు చేజారకుండా క్యాంపులకు తరలించారు. ఒకవర్గానికి చెందిన కౌన్సిలర్లు వారంరోజులుగా గోవాతోపాటు ఇతర పర్యాటక ప్రాంతాల్లో పర్యటిస్తున్నట్లు సమాచారం. వారంతా ఓటింగ్ రోజు కొత్తగూడేనికి చేరేలా కౌన్సిలర్లను తమ ఆధీనంలో ఉంచుకుని నేరుగా సమావేశ మందిరానికి తీసుకొచ్చేలా ప్రణాళికను రూపొందించినట్లు తెలుస్తోంది. చైర్‌పర్సన్ పదవిని ఆశిస్తున్న మరో నేత సైతం అధికార పార్టీలో చేరి తమకు అనుకూలమైన కౌన్సిలర్ల మద్దతు కూడగట్టుకుని అవిశ్వాస పరీక్ష నెగ్గేలా పావులు కదుపుతున్నారు. ఈ అవిశ్వాస పరీక్షలో నెగ్గేందుకు ఇరువర్గాల నాయకులు కౌన్సిలర్లకు రూ.2లక్షల నుంచి రూ.3లక్షల వరకు నజరానా ముట్టచెప్పినట్లు ప్రచారం జరుగుతోంది.

ఒకే పార్టీలో రెండు వర్గాలు..

కొత్తగూడెం మున్సిపాలిటీలో 36వార్డులకు గాను 24 వార్డుల్లో బీఆర్ఎస్ కౌన్సిలర్లు ఉండగా 8వార్డుల్లో సీపీఐ, ఒక వార్డులో కాంగ్రెస్, రెండువార్డుల్లో స్వతంత్రులు విజయం సాధించారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల ముందు సీపీఐకి చెందిన ఐదుగురు కౌన్సిలర్లు బీఆర్ఎస్‌లో చేరడంతో బీఆర్ఎస్ బలం 29కి చేరింది. బీఆర్ఎస్‌లో ఏర్పడ్డ అంతర్గత విభేదాల కారణంగా 22మంది కౌన్సిలర్లు కొత్తగూడెం మునిసిపల్ చైర్‌పర్సన్‌గా కొనసాగుతున్న సీతాలక్ష్మిపై అవిశ్వాస తీర్మానంపై సంతకాలు చేసి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో అవిశ్వాస పరీక్ష అనివార్యమైంది. ఎట్టి పరిస్థితుల్లోనూ తన పదవి కాపాడుకోవాలనే లక్ష్యంతో చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి తమకు అనుకూలమైన కౌన్సిలర్లతో క్యాంపునకు తరలివెళ్లారు. చైర్‌పర్సన్ పదవిని ఆశిస్తున్న బీమా శ్రీవల్లి సైతం తమకు అనుకూలమైన కౌన్సిలర్లను అందుబాటులో ఉంచుకున్నారని సమాచారం. మునిసిపల్ చైర్‌పర్సన్ పదవికాలం ఇంకా 11నెలలు మాత్రమే ఉన్నా ఇరువర్గాలు భారీగానే కౌన్సిలర్లకు బేరసారాలు చేస్తున్నారనే ప్రచారం జోరుగా సాగుతోంది. సోమవారం జరిగే విశ్వాస పరీక్షలో నెగ్గేందుకు ఇరువర్గాలు తమ సర్వశక్తులు ఒడ్డుతున్నాయి. క్యాంపుల్లో ఉన్న కౌన్సిలర్లు విశ్వాస పరీక్షలో చివరికి ఎవరి పక్షాన నిలుస్తారనేది ఉత్కంఠగా మారింది. ఇదిలా ఉండగా మునిసిపల్ అవిశ్వాస తీర్మానానికి సంబంధించి కలెక్టర్ ఆదేశాల మేరకు కొత్తగూడెం ఆర్డీవో, మునిసిపల్ కమిషనర్లు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. అవిశ్వాసం నెగ్గాలంటే తప్పని సరిగా 24మంది కౌన్సిలర్లు సమావేశానికి హాజరుకావాల్సి ఉంది. అయితే 24 మంది కౌన్సిలర్లు ఈ సమావేశానికి హాజరువుతారా లేదా వేచి చూడాలి. కోరం పూర్తైతేనే సమావేశం జరిగే అవకాశం ఉంది. కోరం పూర్తి కాకపోతే సమావేశం వీగిపోయే అవకాశం ఉంటుందని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు.


భారీ బందోబస్తు

మునిసిపల్ పాలకవర్గ అవిశ్వాస తీర్మానం జరుగుతున్న నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు ముందస్తు చర్యలు చేపడుతున్నారు. మునిసిపల్ కార్యాలయ పరిసరాలను తమ ఆధీనంలో తీసుకుని భద్రత ఏర్పాట్లు చేస్తున్నారు. కొత్తగూడెం పట్టణంలో 144 సెక్షన్ విధిస్తున్నట్లు కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ తెలిపారు. మునిసిపల్ కార్యాలయ సమీపంలో బారికేడ్లను ఏర్పాటు చేశామని, కౌన్సిలర్లను తప్ప ఎవరినీ కార్యాలయానికి అనుమతించడం లేదని తెలిపారు. కార్యాలయ సమీపంలో ఇద్దరు, ముగ్గురు మించి గుమికూడకుండా నిషేదాజ్ఞలు ఉన్నాయన్నారు.

అదిగదితో ...
జాఫర్ బావి

- క్రీ.శ. 950లో సితాబ్‌ఖాన్ హయాంలో నిర్మాణం
- కళాత్మక పనితీరు, ప్రజా అవసరాల కలబోత
- నాటి ఇంజనీరింగ్ ప్రతిభకు తార్కాణం
- పునరుద్ధరించి అందుబాటులోకి తెచ్చిన ప్రభుత్వం
- విద్యుద్దీపాలంకరణతో కొత్త శోభ

7



పోలీసు స్టేషన్‌కు కష్టాలు

- విడుదల కానీ గెజిట్ నోటిఫికేషన్ ● ఐదుగురు ఎస్‌ఐల స్థానంలో ఒకే ఒక్కరు
- స్టేషన్‌లో 50మంది సిబ్బందికి గాను 20మందితో విధులు
- ఇటు ప్రొటోకాల్, అటు రోడ్డు ప్రమాదాలు, ఇతర కేసుల నమోదుతో సతమతం

రఘునాథపాలెం, ఫిబ్రవరి18: ఎవ్వరికైనా సమస్యలు వస్తే పోలీసు స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేస్తారు.. ఆదే పోలీసు స్టేషన్‌కు సమస్యలు వస్తే ఎవ్వరికి చెప్పుకోవాలి.. ఇదే ప్రశ్న రఘునాథపాలెం పోలీసుస్టేషన్‌కు ఉత్పన్నమైంది. అనేక నివేదికల మేరకు అధికారికంగా పోలీసుస్టేషన్ హోదాను పెంచినా ఆ మేరకు గెజిట్ నోటిఫికేషన్ విడుదల కాకపోవడంతో పోలీసు అధికారులు, సిబ్బంది రాక పోవటంతో పనిబారంతో పోలీసులు క్షణం తీరక లేక సతమతం అవుతున్నారు.

పేరుకే హోదా పెంపు

ఖమ్మం అర్బన్ ప్రాంతంలో గ్రామాలకు ప్రభుత్వ అభివృద్ధి నిధులు మంజూరులో ఇబ్బందులు రావటంలో సాంకేతికంగా ఇబ్బందులు ఏర్పాడుతున్నాయని ప్రస్తుత రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆ నాటి ఖమ్మం ఎమ్మెల్యేగా బాధ్యతలు నిర్వహిస్తూ 12.10.2016న దసరా పర్వదినోత్సవం సందర్భంగా రఘునాథ పాలెం మండలానికి గెజిట్ నోటిపికేషన్ విడుదల చేయించారు. ఖమ్మంనగరంతో పాటుగా 17 గ్రామ పంచాయతీలు, ఖమ్మం రూరల్ మండలంలోని దారేడు, కామంచికల్‌తో కలిపి మొత్తం 19 గ్రామ పంచాయతీతో రఘునాథపాలెం మండలానికి పునాది వేశారు. ఆ తర్వాత రఘునాథపాలెం రెవెన్యూ పరిదిలోని ఇల్లెందు ఖమ్మం ప్రధాన రహదారి వెంట తహసిల్దారు, ఎంపీడీవో, పోలీసు స్టేషన్‌లను ప్రత్యేకంగా ఏర్పాటు చేసి మండల కేంద్రం రూపాన్ని తీసుకొచ్చారు. ఆతర్వాత 19 గ్రామ పంచాయతీలు పునర్విభజన మేరకు 40 గ్రామ పంచాయతీలుగా పెరిగాయి. ఇల్లెందు ఖమ్మం ప్రధాన రహదారిలోని ఎక్కువ దూరం రఘునాథపాలెం పోలీసు స్టేషన్ పరిదిలోకి రావటంతో రోడ్డు ప్రమాదాలు పర్యవేక్షణ భారంగా మారింది. ఖమ్మంనగరంలో ఉన్న కలెక్టర్ కార్యాలయం రఘునాథపాలెం మండలంలోని వీవెంకటాయపాలెంలో సమీకృత కలెక్టర్ కార్యాలయంలో నిర్మాణం చేసి పరిపాలన అమలులోకి వచ్చింది. దీంతో ఇటు కలెక్టరేట్ ఎదుట నిత్యం వామపక్షాలు, ప్రజాసంఘాలు ధర్నాలు, రాస్తారోకోలు, స్థానిక ఎమ్మెల్యేలకు మంత్రిగా బాధ్యతలు నిర్వహించటంతో ప్రొటోకాల్ నిర్వహణ తరుచూ రోడ్డు ప్రమాదాలతో పోలీసులకు క్షణం కూడా కునుకు లేకుండా పోయింది.

ఖమ్మం రూరల్ సర్కిల్ నుంచి ఖమ్మానికి మార్పుతో హోదా పెంపు



రఘునాథపాలెం పోలీసు స్టేషన్ కార్యాలయం

ఖమ్మం రూరల్ సర్కిల్ పరిదిలో సబ్ ఇన్స్‌పెక్టర్ పరిపాలనలో రఘునాథపాలెం పోలీసు స్టేషన్ నిర్వహణ ఉండేది. దీంతో పోలీసు ఉన్నతాధి కారులు పలు నివేదికలు ఆదారంగా రఘునాథపా లెం పోలీసుస్టేషన్‌ను ఎస్‌ఐ స్థాయి నుంచి ఇన్స్‌పెక్టర్ స్థాయికి అసెంబ్లీ ఎన్నికల నోటీపికేషన్‌కు ముందుగా హోదాను పెంచారు. ప్రస్తుతం ఇన్స్‌పెక్టర్ స్థాయిలో పోలీసుస్టేషన్ పరిపాలన కొనసాగుతుంది. శాంతి భద్రతల పరిరక్షణలో ఖమ్మం రూరల్ ఏసీపీ పరిధి నుంచి ఖమ్మం నగర ఏసీపీ పరిధిలోకి రఘునాథ పాలెం పోలీసుస్టేషన్ నిర్వహణ మారింది.

ఎస్‌ఐ స్థాయిలో పోలీసుస్టేషన్‌లకు 30మంది సిబ్బంది, ఇన్స్‌పెక్టర్ స్థాయి పోలీసుస్టేషన్‌లకు ఐదుగురు ఎస్‌ఐలతో పాటుగా 50మంది సిబ్బందిని కేటాయిస్తారు. కానీ రఘునాథపాలెం పోలీసు స్టేషన్‌కు గెజిట్ నోటిపికేషన్ విడుదల కానీ కారణంగా కేవలం 20మంది సిబ్బంది, సింగిల్ ఎస్‌ఐతో సీఐ పోలీసుస్టేషన్ పరిపాలన కొనసాగిస్తున్నారు. తరుచూ ప్రొటోకాల్, కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమాలు, ఇల్లెందు ఖమ్మం రహదారిపై జరిగే ప్రమాదాలు, సాదారణ కేసులతో సిబ్బంది లేక పోలీసు అధికారులు సతమతం అవుతున్నారు.

గెజిట్ నోటిఫికేషన్ లేక ఇబ్బందులు..



ఇన్స్‌పెక్టర్ స్థాయి హోదా పోలీసు స్టేషన్‌కు కల్పించటంతో బాధ్యతలు నిర్వహిస్తున్నాం. అయితే ఇంకా గెజిట్ నోటిపికేషన్ విడుదల కాకపోవటంతో ఎస్‌ఐలు, పోలీసు సిబ్బంది కేటాయింపు జరగలేదు.

● శ్రీహరి, సీఐ, రఘునాథపాలెం

ఆర్యవైశ్య కార్పొరేషన్ సాధనకు కృషి

● ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర కోశాధికారి కల్వ సుజాత


మాట్లాడుతున్న కల్వ సుజాత

చింతకాని, ఫిబ్రవరి 18: ఆర్యవైశ్య కార్పొరేషన్ సాధనకు కృషి చేస్తానని ఆర్యవైశ్య సంఘ రాష్ట్ర కోశాధికారి, పీసీసీ రాష్ట్ర కోశాధికారి కల్వ సుజాత అన్నారు. ఆదివారం మండల పరిధిలోని కొదుమూరు గ్రామంలో జ్యోతి కళ్యాణ మండపంలో నిర్వహించిన ఆర్యవైశ్య మండల కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఆర్యవైశ్యులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలన్నారు. ఆర్యవైశ్యుల్లో ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాల్లోని విద్యా ర్థుల ఉన్నత చదువుల కోసం తన వంతు సహాయసహకారాలు అందజేస్తానన్నారు. ఆర్యవైశ్యుల కార్పొరేషన్ సాధన కోసం అందరూ ఏకతాటిపై నిలవాలన్నారు. అనంతరం మండల కార్యవర్గ ప్రమాణ స్వీకారం నిర్వహించారు. మండల అధ్యక్షుడిగా నాగుబండి వెంకట నారాయణ, ప్రధాన కార్యదర్శిగా చల్లా కృష్ణారావు, కోశాధికారిగా కొండా దుర్గాశంకర్‌తో పాటు పలువురు సభ్యుల ప్రమాణ స్వీకారం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వనమా వేణుగోపాలరావు, నాయకులు దేవకీ వాసుదేవరావు, కోళ్ల రాధాకృష్ణ, కొదుమూరు జగన్నాథం, కొంకిమళ్ల మృత్యుం జయరావు, తేలుకుంట్ల శ్రీనివాసరావు, కొంకిమళ్ల బాలకృష్ణ పాల్గొన్నారు.

ఇళ్ల మధ్య మందిర నిర్మాణం చేయొద్దు

మధిరటౌన్, ఫిబ్రవరి18: ఇళ్ల మధ్య మందిర నిర్మాణం చేయవద్దు అంటూ స్థానికులు నిర్మాణ ప్రదేశంలో ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. మధిర సుందరయ్యనగర్ 6వ లైన్ లో సత్యసాయి సేవా కేంద్రము పేరుతో నిర్మాణం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని, ఇంటి నిర్మాణానికి మునిసిపాలిటీ నుంచి అనుమతి తీసుకుని తరువాత శ్రీసత్యసాయి ప్రేమామృత ధార సేవ ట్రస్టు ఖమ్మం వారికి రిజిష్టర్ చేసారని తెలిపారు. ఇప్పటికే ఈ రోడ్డు చాలా ఇరుకుగా ఉందని ఇక్కడ సేవా కేంద్రం, భజన మందిరం నిర్మిస్తే స్థానికులకు చాలా ఇబ్బందులకు గుర వుతారని తక్షణమే దాని అనుమతులు రద్దు చేసి నిర్మాణాన్ని ఆపాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళ్యాణపు పుల్లారావు, నాళ్ల శ్రీనివాసరావు, నాళ్ల నారాయణరావు, సాదం వెంకటేశ్వర రావు, బెజవాడ రవిబాబు, గుర్రం శ్రీనివాసరావు, లింగంశెట్టి శ్రీనివాసరావు, పరిశా శ్రీనివాసరావు, చారి, ఏలూరి రామారావు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

సత్తుపల్లిలో కనుమరుగైన ఫుట్‌పాత్‌లు ..?

- నడవాలంటే నరకప్రాయమే
- వాహనాల వేగం..రద్దీతో భయం భయం
- పట్టించుకోని అధికారులు

సత్తుపల్లిరూరల్, ఫిబ్రవరి18: పాదచారులు భద్రత కోసం సత్తుపల్లి మునిసిపాలిటీలో ఏర్పాటు చేసిన ఫుట్‌పాత్‌లు ఆక్రమణకు గురవుతున్నాయి. కూరగాయాల నుంచి మొదలుకొని చికెన్ సెంటర్లు, బిర్యానీ పార్సిల్స్, కర్రీ పాయింట్స్, బట్టల దుకాణాలు, సెల్‌ఫోన్ షాపులు, చెప్పుల దుకాణాలు, టీస్టాల్, పండ్ల దుకాణం, బజ్జీల బండి, మెకానిక్ షెడ్స్ తదితర చిన్నా చితకా వ్యాపారులు ఫుట్‌పాత్‌లపై తిష్టవేశారు. సత్తుపల్లి ఆర్టీసీ బస్టాండ్ మొదలుకొని పాత సెంటర్ వరకు ఏర్పాటు చేసిన ఫుట్‌పాత్‌లను ఆయా వ్యాపా రులు ఆక్రమించడంతో పాదచారులు నడవాడానికి కూడా స్థలం లేకుండా పోతోంది. సాయంత్రం రద్దీ సమయాల్లో పాదచారులకు నరకం కనిపిస్తోంది. ప్రధాన కూడళ్లు, ఇతర రద్దీ ప్రాంతాల్లో వీధి వ్యాపారుల ఆక్రమణలు ఒకవైపు ఉంటే, మరో వైపు ఆయా షాపుల యజమానులు తమ వాహనాలకు పార్కింగ్ స్థలాలుగా ఫుట్‌పాత్‌లను వాడుకుంటున్నారు. ఇక షాపింగ్ సమయాల్లో ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లు సైతం ఫుట్‌పాత్‌లపై


పట్టణంలో ఫుట్‌పాత్‌పై వాహనాలు


ఫుట్‌పాత్‌లేని ప్రధాన రహదారి

నిలపడంతో పాదచారులు నడవడానికి కనీస స్థలం లేక నానా అవస్థలు పడుతున్నారు. ప్రమాద రహిత ప్రయాణమే లక్ష్యంగా నగర రహదారుల వ్యవస్థను తీర్చిదిద్దాల్సిన మునిసిపల్, పోలీసు అధికారులు తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. పాదచారుల కోసం కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్మించిన ఫుట్‌పాత్‌లను దుకాణదారులు, చిన్నా చితకా వ్యాపారులు ఆక్రమించి దందా కొనసాగిస్తున్నారు. చిరు వ్యాపారుల కోసం మునిసిపల్ భవనం పక్కన నిర్మిస్తున్న వెజ్, నాన్ వెజ్ మార్కెట్ ఏళ్లుగా నిర్మాణంలో ఉంది.

ఫెనాల్టీలు వేసి చేతులు దులుపుకుంటున్న వైనం

మనిషి ప్రాణాలు అత్యంత విలువైనవి కాబట్టి ప్రమాద రహిత ప్రయాణానికి అనుగుణంగా రహదారులను క్లియర్ చేయాల్సిన పోలీసులు అంటీముట్టనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలుఉన్నాయి. అప్పుడప్పుడు పెట్రోలింగ్ చేసి రోడ్లపై ఉన్న సామాన్లను తీసుకెళ్లడం, పలువురిపై చిన్న మొత్తంలో ఫెనాల్టీలు వేసి చేతులు దులుపుకొంటున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పోలీసులు వెళ్లగానే యథేచ్ఛగా ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారాలు కొనసాగిస్తున్నారు.

జాతరకు ప్రత్యేక బస్సులు..



పాల్వంచటౌన్, ఫిబ్రవరి 18: మేడారంలో జరుగు సమ్మక్క- సారలమ్మ జాతరకు ఆదివారం పాల్వంచ బస్టాండ్ నుంచి ప్రత్యేక బస్సులను మధిర డిపో మేనేజర్ శంకర్ ఎస్‌హెచ్‌ఆర్‌సీ నేషనల్ డైరెక్టర్ యడ్లపల్లి శ్రీనివాసరావుతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ మేడారం జాతరకు పాల్వంచ కేంద్రంగా 45 బస్సులను ఏర్పాటు చేశామన్నారు. ప్రతీ 10 నిమిషాలకు ఒక బస్సు మేడారానికి బయలు దేరుతుందని తెలిపారు. ప్రయాణ చార్జీలు పెద్దలకు రూ.310, పిల్లలకు రూ.170గా ఉంటుందని తెలిపారు. ఈ సౌకర్యాన్ని ప్రయాణికులు వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత స్టేషన్ మేనేజర్ ఇజ్రాయేల్, ఉద్యోగులు పాల్గొన్నారు.

కమిషనరేట్‌లో ఇద్దరు ఏసీపీల నియామకం

ఖమ్మంక్రైం, ఫిబ్రవరి18: ఖమ్మం కమిషనరేట్ పరిధిలో రెండు విభాగాల్లో ఇద్దరు ఏసీపీలను నియమిస్తూ పోలీసు శాఖ నుంచి ఆదివారం ఉత్తర్వులు వెలువడ్డాయి. హైదరాబాద్ పీసీఎస్ అండ్ ఐటీ విభాగంలో ఏసీపీగా విధులు నిర్వహిస్తున్న బి.శ్రీనివాసులును ఖమ్మం ట్రాఫిక్ ఏసీపీగా నియమితులయ్యారు. ఏసీబీ డీఎస్పీగా ఉన్న కె.శ్రీనివాసరెడ్డిని ఖమ్మం సీటీసీ ఏసీపీగా నియమిస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అదే విధంగా సత్తుపల్లి ఏసీపీగా ఉన్న బి.రామానుజంను కరీంనగర్ పీటీసీ డీఎస్పీగా నియమిస్తూ పోలీసుశాఖ అధికారులు ఉత్తర్వులు జారీచేశారు.

రోడ్లు వేస్తారంటే కంచెలు తీశారు..

- రెండేళ్లవుతున్నా సీసీ రోడ్ల ఊసే లేదు
- అనుసంధాన వీధులకు సీసీ రోడ్లు కలేనా?
- పట్టించుకోని అధికారులు

మణుగూరు, ఫిబ్రవరి18: మారేం ఫర్వాలేదు.. మీ వాడకు రోడ్లు సరిగా లేవు.. ఇరుకు వీధులు.. రోడ్లు కావలంటే ఈ ఇండ్ల మధ్య స్థలం ఉండాలి .. అప్పుడు రోడ్లు పడతాయి.. అని కొందరు అధికారులు చెప్పిన మాటలను నమ్మారు ఆ గ్రామస్థులు దాదాపు 10 వీదుల్లో సీసీరోడ్ల నిర్మాణాల కోసం స్థలాన్ని వదలాలని నిశ్చయించుకుని రోడ్ల నిర్మాణాలు వస్తాయని ఇండ్ల రక్షణగా కట్టుకున్న కంచెలను పీకేశారు.. రెండేళ్లు అవుతుంది.. సీసీ రోడ్లు లేవు ఏమీ లేవు.. జంతువులకు తమ ఆవాసాలు నిలయంగా మారి పరిసరాలను అపరిశుభ్రం చేస్తున్నాయంటున్నారు. స్థానిక గ్రామస్థులు రోడ్ల నిర్మాణం కోసం కొలతలు కూడా కొలిచారు.. ఆకొలతలు ఏమయ్యాయో మాకు రోడ్లు ఎప్పుడు వస్తాయో అంటూ ఇప్పటికీ ఆశగా ఎదురు చూస్తున్నారు. ఇది మణుగూరు మునిసిపాలిటీలోని రాజుపేట గ్రామ వాసులు గోడు..

మణుగూరు మునిసిపాలిటీ పరిధిలోని దాదాపు 300 గడప ఈ గ్రామంలో నివాసముంటుంది. దాదాపు 8 ఏళ్ల క్రితం ఇక్కడ కొన్ని అనుసంధాన వీధులకు సరైన దారి లేక పోవడంతో సీసీ రోడ్లు ను ఏర్పాటు చేశారు. ఇంకా మరో పది వీధులకు సీసీ రోడ్ల ను ఏర్పాటు చేయాల్సి ఉంది. స్థానికులకు మెరుగైన రాకపోకలు సాగించేందుకు సీసీ రోడ్లను ఏర్పాటు చేయిస్తామని స్థానిక అధికారులు ప్రజాప్రతినిధులు హామీలు ఇచ్చారు. ఆ తర్వాత కొన్ని రోజులకు కాంట్రాక్టర్ల కూడా వచ్చి రోడ్ల కొలతలు కూడా తీసుకున్నారు. మీవి ఇరుకు ప్రాంతాలు ఇండ్ల మధ్య ఉన్న కంచెలను పీకేసీ రోడ్లు నిర్మాణాలకు అనువుగా ప్రదేశాన్ని ఉంచాలి అని వారు పేర్కోనడంతో ఇకేం ముంది తమకు రోడ్లు వస్తాయని స్థానికులు అంతా కలసి


సీసీ రోడ్ల కోసం ఎదురు చూస్తున్న వీధులు

ఇండ్ల మధ్య ఉన్న కంచెలను పీకేసీ రోడ్లకోసం కొంత స్థలాలను కేటాయించుకున్నారు. ఇక వస్తారు. అగో వస్తారు రోడ్లు వేస్తారన్న మాటలు వింటూ వింటూ స్థానికులకు రెండేళ్ల సమయం దాటిపోయింది. అయినా నేటికీ సీసీ రోడ్ల నిర్మాణ ఊసే లేదు.. ఇప్పటికీ తమ ఇండ్ల ముందు కంచెలు పీకేసి రోడ్ల కొసం స్థానిక ప్రజలు ఎదురు చూస్తూనే ఉన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సీసీరోడ్లు మంజూరు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయి

దాదాపు పది వీధుల వరకు సీసీ రోడ్లను వేయిస్తామంటే స్థలాన్ని కేయింపుల కొసం కంచెలను తీసెసాం. రోడ్ల నిర్మిస్తామని కొలతలు కూడా తీసుకెళ్లారు. రేండేళ్ల పూర్తి అయింది. కుక్కలు, పందులు, ఇతర పశువులు ఇండ్లలోకి వచ్చేస్తున్నాయి. పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయి. ఇప్పటికైనా మా రాజుపేట గ్రామంలో మిగులు సీసీ రోడ్లను ఏర్పాటు చేసేందుకు అధికారులు ప్రజా ప్రతనిధులు మా గోడు చూసైనా ఏర్పాటు చేయాలని కోరుతున్నాం

● లక్కి రామ్, స్థానికుడు

యువకుడి అదృశ్యం


మహదేవ్

జూలూరుపాడు, ఫిబ్రవరి18: యువకుడు అదృశ్యమైన సంఘటనపై ఆదివారం జూలూరుపాడు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి మండలం దంతలమామిడి గ్రామానికి వంతెన మహదేవ్ (38) అనే యువకుడు భద్రాద్రి జిల్లాలోని జూలూరుపాడు మండలంలోని సూరారం అటవీ ప్రాంతంలో ప్లాంటేషన్ పనులకు చేపట్టేందుకు గ్రామస్తులతో కలిసి ఈ నెల 9వ తేదీన ఇంటి నుంచి బయలుదేరి వచ్చాడు. 10వ తేదీ మధ్యాహ్నం వారందరు సూరారం గ్రామానికి చేరుకున్నారు. అదే రోజు సాయంత్రం సమయంలో మహదేవ్ ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయాడు. అతని కోసం వెతికినప్పటికీ ఎలాంటి ఆచూకీ లభించలేదు. అటవీ ప్లాంటేషన్ మేనేజర్ టి.రాజేందర్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఇరుగు జీవన్‌రాజు తెలిపారు.

మేడారం జాతరకు వెళ్తూ..

గుండెపోటుతో సూర్యాపేట జిల్లా వాసి మృతి

కూసుమంచి, ఫిబ్రవరి18: స్నేహితులతో కలిసి మేడారం జాతరకు వెళ్తూ గుండె పోటుతో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని ఈశ్వరమాధారం గ్రామ సమీపంలో ఆదివారం జరిగింది. వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌కు చెందిన భిక్షం(49) తన స్నేహితులతో కలిసి మేడారం జాతరకు ద్విచక్ర వాహనాలపై వెళ్తున్నాడు. ఈక్రమంలో ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం ఈశ్వరమాధారం బ్రిడ్జి వద్దకు చేరుకోగానే భిక్షం ఒక్కసారిగా గుండెపోటుతో కుప్పకూలిపోయాడు. వెంటనే స్నేహితులు అతడిని స్థానిక డాక్టర్ వద్దకు తీసుకెళ్లే సరికి మృతి చెందాడు. దీంతో స్నేహితులు ఆందోళనకు గురయ్యారు. మృతదేహాన్ని స్వగ్రామం తీసుకెళ్లారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

ఖమ్మం రూరల్, ఫిబ్రవరి 18: పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులపై రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని నాయుడుపేట, జలగంనగర్‌కు చెందిన ఆరుగురు వ్యక్తులు నాయుడుపేట మున్నేరు వంతెన వద్ద శనివారం పేకాట ఆడుతున్నారని విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు పేకాట స్థావరంపై దాడి చేసి వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ. 5,880 నగదు, 5 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని, పేకాట ఆడుతున్న వారిని అదుపులోకి తీసుకుని వారిపై కేసు నమోదు చేశారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, ఫిబ్రవరి18: ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన కొత్తగూడెం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో పరిధిలో ఆదివారం ఛోటు చేసుకుంది. వన్‌టౌన్ సీఐ కరుణాకర్ తెలిపిన వివరాల ప్రకారం..పట్టణంలోని మధురబస్తీకి చెందిన ఈ.శ్రీనివాస్(40) చిన్న పనులు చేస్తూ జీవిస్తున్నాడు. పని లేకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాడు. జీవితంపై విరక్తి చెంది పురుగుల మందు సేవించి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి సోదరి కృష్ణవేణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రేషన్ బియ్యం దందా

- గంగబండతండ కేంద్రంగా సూర్యాపేట జిల్లా కోదాడకు తరలింపు
- పట్టించుకోని అధికారులు

కూసుమంచి, ఫిబ్రవరి 18: గ్రామాల్లో రేషన్ బియ్యం అక్రమ దందా పెద్దఎత్తున జరుగుతోంది. మండలంలో వినియోగదారుల నుంచి రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి సూర్యాపేట జిల్లా కోదాడ తరలిస్తున్నారని సమాచారం. ఈఅక్రమ దందాలో కోదాడకు చెందిన ఒక మిల్లర్ కీలకంగా వ్యవహరిస్తున్నాడని ఆరోపణలు ఉన్నాయి. గతం మూడేళ్ల క్రితం ఈప్రాంతం నుంచి పెద్దఎత్తున అక్రమ దందా నడవడంతో సదరు వ్యక్తిపై పీడీ యాక్ట్ పెట్టడంతో కొన్ని రోజుల పాటు నిలిచిపోయింది. మళ్లీ ఇప్పుడు పెద్దఎత్తున పడగవిప్పింది.

60శాతం బియ్యం పక్కదారి

రేషన్ షాపుల ద్వారా పంపిణీ చేస్తున్న బియ్యంలో 30 నుంచి 40 శాతం మాత్రమే వినియోగిస్తుండటంతో 60శాతంపైగా బియ్యం పక్కదారి పడుతున్నాయి. అటుతిరిగి ఇటు తిరిగి బియ్యం రేషన్ షాపులకే చేరుతున్నాయి. దళారుల ద్వారా కొనుగోలు


పట్టుకున్న బియ్యాన్ని ఆటోల్లో తరలిస్తున్న పోలీసులు(ఫైల్)

చేసిన బియ్యాన్ని రీసైక్లింగ్ చేసి మిల్లర్లు పంపిణీ చేస్తున్నారు. ప్రతినెలా బియ్యం దందా కొనసాగుతున్నా అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవని ఆరోపణలు ఉన్నాయి.

తూతూమంత్రంగా కేసులు

మండల పరిధిలోని గంగబండతండా తరలించి అక్కడ నుంచి కోదాడకు తరలిస్తున్నారని సమాచారం. జుజ్జులరావుపేట గ్రామంలోనూ, గంగబండతండా శివారులోనూ ఇటీవల సుమారు 200 కింటాళ్ల బియ్యం పట్టుకున్నారు. అదేవిధంగా గట్టుసింగారం సమీపంలోని ఒకపత్తిచేనులో అక్రమంగా నిల్వ ఉంచిన సుమారు రూ.5 లక్షల విలువైన 250 బస్తాల బియ్యాన్ని స్వాధీనం చేసుకుని ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. సూర్యాపేటలో కూసుమంచి ప్రాంతం నుంచే తరలించిన సుమారు 20 టన్నులు పట్టుకున్నారు. అంటే.. ఎంత బియ్యం తరలిపోతుందో అర్థం చేసుకోవచ్చు. అదేవిధంగా కూసుమంచి, నేలకొండపల్లి, తిరుమలాయపాలెం మండలాలనుంచి ప్రతినెలా నాలుగైదు లారీల బియ్యం సరఫరా అవుతున్నట్లు సమాచారం. ఇంత జరుగు తున్నా రెవెన్యూ, సివిల్ సప్లై అధికారులు పట్టిం చుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. రేషన్ బియ్యం అక్రమ రవాణాను అడ్డుకోవాలని కోరుతున్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఆరుగురికి గాయాలు

వైరా, ఫిబ్రవరి 18: రోడ్డు ప్రమాదంలో బేతుపల్లి గంగారం టీఎస్ స్పెషల్ బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్‌తో పాటు మరో వ్యక్తికి గాయాలైన సంఘటన వైరా విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో జాతీయ ప్రధాన రహదారిపై ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...ఖమ్మం నుంచి కారులో తల్లాడ వైపు వెళ్తున్న శ్రీనివాసరావు తల్లాడ నుంచి వైరా వైపు ఎదురుగా వస్తున్న ఒక కారు వెనుకభాగాన్ని తాకిస్తూ లారీని ఢీకొట్టారు. దీంతో కారు ముందుభాగం నుజ్జునుజ్జు అయి రోడ్డుకు అడ్డంగా తిరిగింది. కారులోని ఎయిర్‌బ్యాగ్స్ ఓపెన్ కావడంతో శ్రీనివాసరావు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఎదురుగా వచ్చిన కారులోని మరో వ్యక్తికి కూడా స్వల్పగాయాలయ్యాయి. ప్రమాదానికి గురైన రెండు కార్లు రోడ్డుకు అడ్డంగా నిల్చిపోవడంతో జాతీయ ప్రధాన రహదారిపై రెండు వైపులా గంటసేపు ట్రాఫిక్ స్తంభించింది. గాయపడిన శ్రీనివాసరావును మరో వ్యక్తిని చికిత్స కోసం స్థానిక ఆస్పత్రికి తరలించారు. వైరా ఎస్‌ఐ వంశీకృష్ణ భాగ్యరాజ్ తమ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొని రోడ్డుకు అడ్డుగా ఉన్న కార్లను తొలగించి, రాకపోకలను పునరుద్ధరించారు.

జూలూరుపాడు: రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని కొమ్ముగూడెం గ్రామ సమీపంపలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సుజాతనగర్ మండలం రూప్లాతండా గ్రామానికి చెందిన బాణోత్ విజేందర్ ద్విచక్రవాహనంపై సుజాతనగర్ నుంచి జూలూరుపాడు వైపునకు వస్తున్నాడు. ఈ క్రమంలో ఖమ్మం నుంచి కొత్తగూడెం వైపు వెళ్తున్న లారీని ఢీకొట్టాడు. ఈ సంఘటనలో విజేం దర్‌కు గాయాలయ్యాయి. సంఘటన స్థలాన్ని హెడ్‌కానిస్టేబుల్ దయానంద్ సందర్శించి ప్రమాద వివరాలను సేకరించారు. క్షతగాత్రుడిని ప్రైవేట్ వాహనంలో ఆసుపత్రికి తరలించారు.

ఖమ్మం రూరల్: ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొని ఇద్దరికి గాయాలైన సంఘటన ఖమ్మం రూరల్, మండలం, ఏదులాపురం వద్ద ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆరెంపుల గ్రామానికి చెందిన ప్రీతమ్‌రా హుల్, నాగరాజు ఇద్దరు కలిసి ద్విచక్రవాహనంపై శనివారం రాత్రి ఖమ్మం నుంచి ఆరెంపుల వస్తుం డగా మార్గ మధ్యలో ఏదులాపురం వద్ద ఎదురుగా వస్తున్న కారు ఢీ కొంది. ఈ ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. ప్రీతమ్‌రాహుల్ తండి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


గాయపడిన స్పెషల్ బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ శ్రీనివాస్

కరకగూడెం: ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొట్టడంతో వ్యక్తికి గాయాలైన సంఘటన మండల పరిధిలోని భట్టుపల్లి పంచాయతీ వీరాపురం క్రాస్ రోడ్డు వద్ద ఆదివారం జరిగింది. వివరాల ప్రకారం.. భూపాలపల్లి జిల్లా సింగరేణిలో పనిచేస్తున్న ఇల్లెందు మండలం మేదరబస్తికి చెందిన కడి నవీన్ ద్విచక్ర వాహనంపై కరకగూడెం మీదుగా తన ఇంటికి వెళ్తున్న క్రమంలో వీరాపురం క్రాస్ రోడ్డు వద్ద వెనుక నుంచి కారు ఢీ కొట్టింది. దీంతో నవీన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. గ్రామస్థులు 108 వాహనంలో కరకగూడెం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం మణుగూరు సింగరేణి వైద్యశాలకు తరలించారు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి

నేలకొండపల్లి, ఫిబ్రవరి18: అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని బోదులబండ గ్రామంలో ఆదివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కూసుమంచి మండలం నేలపట్లకు చెందిన పొట్టపింజర మనోహరి అలియాస్ పూరి(21)కి బోదులబండకు చెందిన పొట్టపింజర విజయ్‌కుమార్‌తో నాలుగేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. కాగా ఆదివారం ఉదయం మృతురాలి అత్త, మామ బయటకు వెళ్లిన సమయంలో మనోహరి ఇంట్లో ఉరి వేసుకున్నట్లుగా చెబుతున్నారు. కానీ మృతదేహం ఫ్యాన్‌కు వేలాడుతూ కింద కూలబడి ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. బయటకు వెళ్లిన మృతురాలి మామ బొందయ్య ఇంటికి వచ్చి చూసే సరికి మనోహరి ఉరి వేసుకుని మరణించి ఉందంటున్నారు. బొందయ్య ఒక్కడే మృతదేహాన్ని కిందకు దించి చుట్టుపక్కల వారిని కాకుండా దూరంగా ఉన్న మృతురాలి బంధువుకు సమాచారం ఇచ్చాడు. గ్రామస్తులు ఆత్మహత్య కాదని, హత్య చేసి ఉరి వేసి ఉంటారన్న అనుమానం వెలిబుచ్చుతున్నారు. పోలీసులు సంఘటనా స్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. కుటుంబ సభ్యుల్లో మామ ఇంటి వద్ద ఉండగా భర్త, అత్తలు పరారీలో ఉన్నారని సమాచారం. మృతురాలు మైనరని, అప్పట్లోనే దొంగతనంగా వివాహం చేసుకున్నట్లు గ్రామస్తులంటున్నారు. ఇదిలా ఉండగా గతంలో కూడా విజయ్‌కుమార్ మొదటి భార్య విద్యుదాఘాతంతో మృతి చెందింది. మృతి చెందిన సమయంలో మృతురాలు గర్భిణి. అప్పట్లోనే ఆమె మృతిపై పలు అనుమానాలు వచ్చాయని స్థానికులు పేర్కొంటున్నారు.

చెర్వుమాధారం చెర్వు లూటీ

● దాదాపు 4టన్నుల చేపలెత్తుకెళ్లినట్లు సమాచారం

నేలకొండపల్లి, ఫిబ్రవరి18: మండల పరిధిలోని చెర్వుమాధారం షాజీదా చెరువులో ఆదివారం మధ్యాహ్నం దాదాపుగా 4టన్నుల చేపలను వలలు కోసి గ్రామస్థులు ఎత్తుకెళ్ళినట్లు సమాచారం. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లాలోనే అతి పెద్ద సాగు వనరు, చేపల పెంపకానికి ఉపయోగపడుతున్న చెర్వు మాధారంలోని షాజీదా చెరువులో గత 3రోజులుగా చేపల వేటను కాంట్రాక్టరు కొనసాగిస్తున్నాడు. బయట నుంచి పల్లెకారులను తెచ్చి, పోలీసుల బందోబస్తు మధ్య చేపలు పట్టి, పట్టిన చేపలను పట్టినట్లుగా టిప్పర్లలో వేసి సూర్యాపేట జిల్లా అనంతగిరి మండలం, తమ్మర దగ్గర ఉన్న ఓమిల్లులో కాంటావేసి, అమ్ముతున్నారు. ఇప్పటి వరకు దాదాపు 250 టన్నుల చేపలను కాంట్రాక్టరు అమ్మినట్లు తెలుస్తోంది. కానీ చేపల చెర్వున్న చెర్వుమాధారం గ్రామస్తులకు చేపలివ్వక పోవడంతో ఆదివారం చెరువు వద్ద కొద్దిపాటి ఘర్షణ జరిగింది. దీనికి తోడు మంగాపురంతండాకు చెందిన వారు సైతం చేపలకు రావటంతో ఇరు గ్రామాల వారు వలలను వేసి సుమారుగా టన్ను చేపలను ఎత్తుకెళ్ళినట్లు తెలుస్తోంది. కానీ కాంట్రాక్టరు అతనికి సంబంధించిన వారు మాత్రం దాదాపు 4టన్నులను ఎత్తుకెళ్లినట్లు ప్రచారం చేస్తున్నారని చెర్వుమాధారానికి చెందిన వారంటున్నారు.

కొదుమూరు సబ్ స్టేషన్ ఆర్టీజెన్ మృతి

చింతకాని, ఫిబ్రవరి 18: మండల పరిధిలోని చింతకాని గ్రామానికి చెందిన అమర్లపూడి రమేష్‌బాబు (38) ఆదివారం అనారోగ్యంతో మృతిచెందాడు. మృతుడు కొదుమూరు గ్రామంలో ని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఆర్టీజెన్ గ్రేడ్-2 (ఆపరేటర్)గా పనిచేస్తున్నాడు. మృతదేహాన్ని విద్యుత్‌శాఖ డీఈ నంబూరి రామారావు, ఏడీఈ తిలక్, ఏఈ వెంకన్న, సిబ్బంది షరీఫ్, పాష, భరత్, విజయ్, రమేష్, నరేష్ సందర్శించి నివాళులర్పించారు. అంత్యక్రియల నిమిత్తం రూ.20 వేల నగదును అందజేశారు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.


రమేష్‌బాబు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న డీఈ రామారావు

వేర్వేరు ఇళ్లల్లో చోరీలు

● రూ.3.20లక్షల నగదు, మూడు తులాల బంగారం అపహరణ

కామేపల్లి, ఫిబ్రవరి 18: ఇంటికి తాళాలను పగులగొట్టి రూ.3.20లక్షలు, మూడు తు లాల బంగారం దొంగలు తాళాలు పగలుకొట్టుకొని వెళ్లిన సంఘటన కామేపల్లి మండలం పొన్నెకల్‌లో జరిగింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. పొన్నెకల్‌కు చెందిన సావిటి మల్లేష్ కుటుంబంతో కలిసి 13రోజుల కిత్రం ఖమ్మంలో ఓ వివాహ వేడుకల్లో పాల్గొనడానికి ఇంటికి తాళాలు వేసి వెళ్లాడు. 17న శనివారం ఇంటికి వచ్చి చూసేసరికి ఇంటి తాళం పగలకొట్టి, బీరువా తాళం తీసి అందులో ఉన్న రూ.3.20 లక్ష ల నగదు, మూడు తులాల బంగారాన్ని ఎత్తుకుపోయారని తెలిపాడు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో బాధితుడు మల్లేష్ ఫిర్యాదు చేయడంతో, పోలీసులు క్లూస్ టీం ద్వారా వేలిముద్రలు సేకరించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

● సుజాతనగర్‌లో రూ.40 విలువ చేసే ఆభరణాలు అపహరణ

సుజాతనగర్, ఫిబ్రవరి 18: ఇంటి తాళాలు పగులగొట్టి చోరీకి పాల్పడ్డ ఘటనపై పోలీస్ స్టేషన్‌లో ఆదివారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సుజాతనగర్ మండల కేంద్రంలోని బాలాజీనగర్ కాలనీకి చెందిన కొట్టి చంద్రయ్య, భార్యతో కలిసి నివాసం ఉంటున్నారు. కాగా ఈ నెల 13న చంద్రయ్య ఆరోగ్యం బాగోలేక ఇంటికి తాళాలేసి ఊరెళ్లాడు. ఆదివారం ఉదయం చంద్రయ్య ఇంటి తలుపులు తెరచి ఉండటం గమనించిన స్థానికులు ఆ


బీరువా తాళం తీసి ఉన్న దృశ్యం

విషయాన్ని ఆయన కుమారుడు రామ చందర్‌రావుకు తెలి పారు. ఆయన తన తండ్రి నివాసానికి చేరుకుని చోరీ జరిగిందని గ్రహించి, పోలీసులకు సమాచారం అందించాడు. ఇంట్లో పరిశీలించగా బీరువా పగులకొట్టిన దొంగలు అందులోని బంగారు ఉంగరం, చెవి దిద్దులు, వెండి దీపపు కుందులు, వెండి కుంకుమ భరిణె చోరీ చేసినట్లు గుర్తించారు. వాటి విలువ సుమారు రూ.40 వేలు ఉంటుందని తెలిపాడు. సంఘటనా స్థలాన్ని పరిశీలించి, బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ జుబేదాబేగం తెలిపారు.


చెల్లా చెదురుగా పడేసిన వస్తువులు

- క్రీ.శ. 950లో సితాబ్‌ఖాన్ హయాంలో నిర్మాణం
- వస్తాదులతో పాటు గుర్రాలు, ఏనుగుల వినియోగం
- గుప్తధనాన్ని వెచ్చించిన వరంగల్ రెడ్డి సోదరులు
- గుహ, రాచమహల్‌ను గుర్తుకుతెచ్చే ఆకృతులు
- కళాత్మక పనితీరు, ప్రజా అవసరాల కలబోత
- నాటి ఇంజనీరింగ్ ప్రతిభకు తార్కాణం
- పునరుద్ధరించి అందుబాటులోకి తెచ్చిన ప్రభుత్వం
- విద్యుద్దీపాలంకరణతో కొత్త శోభ
- వరంగల్, హైదరాబాద్ సరసన ఖమ్మం నగరం


ఖమ్మం ఖిల్లాలో పునరుద్ధరించిన రాజుల కాలంనాటి బావి

ఖమ్మంలోని పురాతన జాఫర్ బావి పూర్వ వైభవాన్ని సంతరించుకుంది. వెయ్యేళ్ల ఘన వారసత్వ చరిత్రగలఈ బావి భవిష్యత్ తరాలకు అందుబాటులోకి వచ్చింది. ఇన్నేళ్ల పాటు హైదరాబాద్, సికింద్రాబాద్ తదితర చారిత్రక పర్యాటక స్థలాలకే పరిమితమైన మెట్ల బావి ఖమ్మం ప్రజల సందర్శనకు అందుబాటులోకి వచ్చింది. ఒంపు సొంపుల ఆకృతులు, అబ్బురపరిచే నిర్మాణాలు, ద్వారాలను పోలిన గుమ్మటాలతో ఖమ్మం ఖిల్లా దిగువన గల ఈ బావి నాటి ఇంజనీరింగ్ ప్రతిభకు కళాత్మక చూపునకు అద్దం పడుతోంది.

అదిగదిగో.. జాఫర్ బావి

పూర్వ వైభవం సంతరించుకున్న కాకతీయుల నాటి చారిత్రక కట్టడం

ఖమ్మం సాంస్కృతికం, ఫిబ్రవరి 18: వరద నీటని ఒడిసి పట్టి నగర ప్రజల దాహార్తి తీర్చాలన్న నాటి ప్రభువుల దార్శనికత జాఫర్ బావిలో కనపడుతోంది. 60 అడుగుల వెడల్పు, 70అడుగుల లోతున ఏర్పాటు చేసిన ఈబావి నీటి ఊట సమృద్ధిగా ఉంది. ఎంతో లోతుగా తవ్వటం వల్ల వరదనీరు నిలిచి భూగర్భజలాల పరిరక్షణకు దోహదం చేసింది. కాకతీయుల కాలంలో క్రీస్తుశకం 950 ప్రాంతంలో సితాబ్‌ఖాన్ పరిపాలకుడిగా ఉన్న సమయంలో నాటి ప్రభువులు ఖమ్మాన్ని తమ రెండో రాజధానిగా చేసుకొని పరిపాలించారన్న ఆధారాలున్నాయి.

గుప్తధనంతో నిర్మాణం

వరంగల్ ప్రాంతానికి చెందిన రంగారెడ్డి, వెలమారెడ్డి, లక్ష్మారెడ్డి అనే సోదరులు తమకు దొరికిన గుప్తధనంతో బావిని నిర్మించారని చరిత్ర చెబుతోంది. నిర్మాణానికి ఏనుగులు, గుర్రాలను, బలాఢ్యులైన వస్తాదులను వినియోగించారని తెలస్తోంది. పదేళ్ల నిర్మాణం అనంతరం క్రీస్తుశకం 1006లో ఖిల్లాప్రవేశం జరిగింది. కాకతీయుల కాలంలో నిర్మితమైన జాఫర్ బావి, ఆతదుపరి,అనేక రాజవంశాలతోపాటు నిజాం నవాబుల పరిపాలననూ చవిచూసింది. జాఫర్ ఉద్ దౌలా (జాఫరుద్దౌలా) స్థానిక ఏలికగా ఉన్న కాలంలో రాజుల స్నాన అవసరాలకోసం ఉపయోగించిన బావి నేటికీ ఏమాత్రం చెక్కు చెదరకుండా ఉంది.

రెండు వైపులా మెట్ల మార్గం..

బావిని సాధారణ బావిగా నిర్మించకుండా ఒక సుందర పర్యాటక స్థలంగా తీర్చిదిద్దటం విశేషం. లోతైన బావిలోకి వెళ్లేందుకు రెండువైపులా మెట్లు, బావిలో నీటి పరిమాణం మేరకు ఎక్కడి నుంచైనా తోడుకునే విధంగా డిజైన్ చేశారు. ఒకవైపు ఖిల్లా బాగ్ నుంచి మరోవైపు శివాలయం ప్రాంతంలోని పాత పట్టణం వైపునుంచి రెండువైపులా బావిపైన భూమికి సమాంతర భాగంలోకి వచ్చేందుకు గుహను పోలిన మార్గాలు ఆదిలోనే పర్యాటకులను ఆశ్చర్యానికి గురిచేస్తాయి. వంతెనను పోలిన పైభాగం గుండా అవతలి ప్రదేశానికి చేరుకోవచ్చు. చూసేందుకు అక్కడి నుంచి సాధారణంగానే కనిపించినా నడక మార్గం అడుగున జాఫర్ బావి సౌందర్యం అలరారుతుంది.

ప్రత్యేక ద్వారాలు, కిటికీలు..

గుహను, రాచమహల్‌ను తలపించే విధంగా నిర్మాణాలున్నాయి. పలు చోట్ల నుంచి రెండు వైపులా బావిని వీక్షించేందుకు ద్వారాలు, కిటికీలను పోలిన ఏర్పాట్లున్నాయి. కాగా వాటికి ఇపుడు విద్యుదీకరణ జరిపి కొత్త సొబగులద్దారు. ఎత్తైన ఖిల్లా దిగువన ఈ బావులను నిర్మించటం వెనుక బహుళార్థ సాధక ప్రయోజనముంది. ఎత్తైన ప్రాంతంలో కురిసే వర్షపునీరు లోతైన బావుల్లో నిండటం వల్ల పట్టణ భూగర్భజలాలు పెరుగుతాయి. ఖమ్మం నగరంలో మొదట్లో ఖిల్లాను ఆనుకొని ఒక కిలోమీటరు పరిధిలోనే ఉండేది కనుక ఖిల్లా బాగ్, శుక్రవారపేట, నిజాంపేట, చెరువు బజార్, ముత్యాలమ్మ గుడి తదితర పరిసర ప్రాంతాలకు ఈబావి ద్వారా భూగర్భజల ప్రయోజనమేర్పడేది.


జాఫర్‌బావిని పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమ్

రాజులనుంచి సామాన్యుల వరకు..

రాచ ఠీవి ఉట్టిపడే అత్యంత కళాత్మకంగా నిర్మించిన ఈ బావిని రాచకుటుంబాలు, అప్పటి నిజాం పాలకుల స్నాన అవసరాలకు వినియోగించగా తదనంతరం పట్టణ ప్రజలు నేరుగా మంచినీటి తోడుకునేందుకు ఉపయోగపడింది. కాలక్రమేనా మునిసిపల్ కుళాయిలు, చేతి పంపులు, వ్యక్తిగత బావులతో జాఫర్ బావికి ఆదరణ తగ్గింది. దశాబ్దాల పాటు చెత్త, వ్యర్థ పదార్థాలతో నిండిన జాఫర్ బావికి గతేడాది మోక్షం కలగగా, సుందరీకరించి శనివారం ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు.

రామ్‌కిషన్‌రావు జీవితం ఆదర్శప్రాయం

- జిల్లా ప్రధాన న్యాయాధికారి బీఎస్ జగ్జీవన్‌కుమార్



ఖమ్మం లీగల్, ఫిబ్రవరి 18: దివంగత సీనియర్ న్యాయవాది మాదిరాజు రామ్‌కిషన్ రావు జీవితం ఆదర్శప్రాయమని, న్యాయవాదులు ఆయనను స్ఫూర్తిగా తీసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయాధికారి బీఎస్ జగ్జీవన్ కుమార్ అన్నారు. ఖమ్మం నగర శివారు గోపాలపురంలోని దత్తాత్రేయ ఆశ్రమంలో ఆదివారం నిర్వహించిన విగ్రహావిష్కరణ కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయాధికారి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో వృత్తి జీవితం కాకుండా మరేదైనా ప్రవృత్తిగా చేయాలంటే కష్టంగా అనిపిస్తోందని, ఇప్పుడు వృత్తి జీవితంలో ఉన్నవారికి అసలు ఖాళీ సమయమే దొరకడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రిటైర్మెంట్ తర్వాత కూడా ఖాళీదొరికే పరిస్థితులు కనిపించడంలేదన్నారు. రామ్‌కిషన్‌రావు పీపీ, జీపీ పదవులు నిర్వహించి వాటికి వన్నెతెచ్చారని అన్నారు. అనంతరం 40ఏళ్ల వృత్తి జీవితం పూర్తిచేసుకున్న సీనియర్ న్యాయవాదులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దిరిశాల కృష్ణారావు, రామ్‌కిషన్‌రావు కుమారులు మాదిరాజు లక్ష్మీనారాయణ, అశోక్‌కుమార్, వినయ్‌కుమార్, మల్లాది వాసుదేవ్, పోట్ల మాధవరావు, సత్యనారాయణ, హర్కార శ్రీరామ్‌రావు, కిలారు బాబీ పాల్గొన్నారు.

ఇంద్రపాలెం నుంచి భద్రాద్రికి పాదయాత్ర


రామాలయంలో భక్త బృందం

భద్రాచలం, ఫిబ్రవరి 18: ఏపీలోని కాకినాడ రూరల్ మండలం ఇంద్రపాలెం నుంచి భద్రాచలం వరకు శ్రీరామ భక్త బృందం పాదయాత్రగా ఆదివారం చేరుకున్నారు. 250 కి.మీ. దూరం ఎనిమది రోజుల పాటు నడుచుకుంటూ వచ్చి రామాలయంలో శ్రీరామకోటి పుస్తకాలను సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తాము పాదయాత్రగా రావడం మూడోసారని వారు తెలిపారు.

పక్షిజాతిని పరిరక్షించడం సామాజిక ధర్మం

భద్రాచలం, ఫిబ్రవరి 18: పక్షిజాతిని పరిరక్షించడం మనిషి సామాజిక ధర్మమని గ్రీన్ భద్రాద్రి గౌరవ సలహాదారు కల్వకూరి అబ్రహం తెలిపారు. భద్రాచలంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ పక్షుల కోసం వరి కంకులు కట్టడం, నూకలు, జొన్నలను వేయడం, మంచినీళ్లు పెట్టడం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ భద్రాద్రి అధ్యక్షులు బెల్లంకొండ రాంబాబు, కార్యదర్శి శ్రీరంగం సంపత్, కామిశెట్టి కృష్ణార్జునరావు, తిరుమలరావు పాల్గొన్నారు.

మౌలిక వసతులపైనే ప్రధాన చర్చ

- 3.06 గంటలపాటు సాగిన ఐటీడీఏ పాలక మండలి సమావేశం
- ఏజెన్సీ సమస్యలను మంత్రుల దృష్టికి తెచ్చిన ప్రజా ప్రతినిధులు

భద్రాచలం, ఫిబ్రవరి 18: భద్రాచలం ఐటీడీఏ పాలక మండలి సమావేశం ఆదివారం నిర్వహించగా ప్రధానంగా విద్య, వైద్యం, మౌలిక వసతులపైనే ప్రధాన చర్చ సాగింది. 19 నెలల అనంతరం జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిగా డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకటరెడ్డితో పాటు ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు ఇతర ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. ఏజెన్సీలో గత దశాబ్ద కాలంగా గిరిజనులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను ఈ సందర్భంగా పలువురు ఎమ్మెల్యేలు మంత్రుల దృష్టికి తెచ్చారు. 3.06 గంటల పాటు ఐటీడీఏ పాలక మండలి సమావేశం సాగింది.



విలీన మండలాల్లో స్థానికత సమస్యగా మారింది
జారె ఆదినారాయణ, అశ్వారావుపేట ఎమ్మెల్యే

పోలవరం ముంపు విలీన మండలాల్లో విద్యార్థులకు స్థానికత పెద్ద సమస్యగా మారింది. ఈ సమస్యను పరిష్కరించాలి. డయాలసిస్ సెంటర్‌లో నెఫ్రాలజీ, మత్తు వైద్యులు లేరు. దీంతో డయాలసిస్‌సెంటర్ ఉన్నా ఉపయోగం లేకుండాపోయింది.



సమావేశాలు సకాలంలో నిర్వహించండి
కూనంనేని సాంబశివరావు, కొత్తగూడెం ఎమ్మెల్యే

ప్రతి మూడు నెలలకు జరగాల్సిన పాలక మండలి సమావేశాలు ఏళ్లతరబడి జరపడం లేదు. ఇకనుంచైనా సమావేశాలు సకాలంలో జరపాలి. న్యాక్ సెంటర్ కోసం ఏర్పాటు చేస్తున్న క్రమంలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి చొరవ చూపడం అభినందనీయం. పోడుసాగుదారులకు బోరుబావులు వేసుకోవడానికి అటవీశాఖ అనుమతులు రావడం లేదు. దీనిపై ప్రభుత్వ పెద్దలు దృష్టిసారించాలి.



వైద్యశాలలో ఖాళీలను భర్తీ చేయాలి
డాక్టర్ తెల్లం వెంకట్రావు, భద్రాచలం ఎమ్మెల్యే

ఏరియా వైద్యశాలలో వైద్యులు, సిబ్బంది పోస్టులను భర్తీ చేయాలి. ఏజెన్సీ ప్రాంతంలో నిరుపేద, మధ్య తరగతి వర్గాలకు పూర్తిస్థాయి వైద్యం అందక ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ప్రభుత్వం ఈ విషయంపై దృష్టిసారించాలి. పోడు భూములకు త్రీఫేజ్ కరెంటు ఇవ్వాలని, సాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలి.



రెండో వారధి పనులు సత్వరమే పూర్తి చేయాలి
మాలోతు కవిత, మహబూబాబాద్ ఎంపీ

భద్రాచలం వద్ద గోదావరిపై నిర్మిస్తున్న రెండో వారధి పనులు సత్వరమే పూర్తి చేయాలి. ఏళ్ల తరబడి ఈ పనులు ముందుకు సాగడం లేదు. ఇందుకు స్పందించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నవమి నాటికి పనులు పూర్తవుతాయని స్పష్టం చేశారు. కాగా ఏజెన్సీలోని మారుమూల ప్రాంతాల్లో వైద్య సేవల మెరుగుకు అంబులెన్సులు ఏర్పాటు చేయాలి.



పీహెచ్‌సీల్లో ఖాళీలు భర్తీ చేయాలి
కోరం కనకయ్య, ఇల్లెందు ఎమ్మెల్యే

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఖాళీగా ఉన్న వైద్యులు, సిబ్బంది పోస్టులను వెంటనే భర్తీ చేయాలి. గిరిజన, మారుమూల ప్రాంతాల్లో ప్రజలకు సత్వర వైద్యం అందేలా చూడాలి. పోడు సమస్యకు శాశ్వత పరిష్కారం చూసేలా చర్యలు తీసుకోవాలి.



ప్రొటోకాల్ సమస్యను పరిష్కరించాలి
తాతా మధుసూదన్, ఎమ్మెల్సీ

నాడు, నేడు ప్రజా ప్రతినిధులకు ప్రొటోకాల్ ప్రక్రియ సమస్యగా మారింది. ప్రజా ప్రతినిధులకు అధికారులు ప్రొటోకాల్ పాటించాల్సిన అవసరం ఉంది. గతంలో పాలక మండలి సమావేశంలో వేదికపైనే ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు అవకాశం కల్పించేవారు.



పోడు సాగుదారులను వేధించవద్దు
మాలోతు రాందాస్‌నాయక్, వైరా ఎమ్మెల్యే

పోడు సాగుదారులను అటవీశాఖ అధికారులు వేధించకుండా ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలి. అన్ని పీహెచ్‌సీల్లో మినీ అంబులెన్స్‌లను ఏర్పాటుచేయాలి. పట్టాలు ఇచ్చిన రైతులకు బోర్లు వేసి వ్యవసాయ కరెంట్ మోటార్లు ఏర్పాటుచేయాలి. గిరిజన నిరుద్యోగ యువతీ యువకులకు ఐటీడీఏ ద్వారా ఉపాధి కల్పించి ట్రైకార్ లోన్స్ మంజూరు చేయాలి.


పర్సును అప్పగిస్తున్న కండక్టర్ లక్ష్మణ్‌ఇంగ్

ఆర్టీసీ కండక్టర్ నిజాయితీ

వైరా, ఫిబ్రవరి 18: సత్తుపల్లి ఆర్టీసీ డిపో కండక్టర్ లక్ష్మణ్‌సింగ్ నిజాయితీని చాటుకున్నారు. ఓ ప్రయాణికుడు పోగొట్టుకున్న పర్సును కండక్టర్ లక్ష్మణ్‌సింగ్ అప్పగించారు. ఆదివారం పువ్వాళ్ల రంగారావు సత్తుపల్లి నుంచి అదే డిపోనకు చెందిన బస్సులో కల్లూరు వరకు ప్రయాణించారు. బస్సు దిగిన తర్వాత రంగారావు తన పర్సు పోయిన విషయాన్ని గుర్తించారు. అదే సమయంలో కండక్టర్ లక్ష్మణ్‌సింగ్ బస్సులో పడిపోయి ఉన్న బస్సును చూసి ఐడీ కార్డులో ఉన్న ఫోన్‌నెంబర్ ఆధారంగా రంగారావుకు కాల్ చేశారు. ఆవెంటనే రంగారావు వైరాలోని తన మిత్రుడు విశ్రాంత ఉపాధ్యాయుడైన చల్లా కృష్ణారావుకు జరిగిన విషయాన్ని వివరించారు. డిపోనకు వచ్చిన కృష్ణారావుకు.. కండక్టర్ లక్ష్మణ్‌సింగ్ పర్సును అప్పగించారు. ఆపర్సులో విలువలైన కార్డులు, నగదు ఉన్నాయి. కండక్టర్ లక్ష్మణ్‌సింగ్ నిజాయితీగా వ్యవహరించి పర్సును అప్పగించడంతో ఆయనను పలువురు అభినందించారు.

ఘనంగా 'పొంగులేటి' వారి రిసెప్షన్


వధూవరులను ఆశీర్వదిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు తుమ్మల, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, శ్రీనివాసరెడ్డి


పీఎస్ఆర్ ప్యాలెస్‌లో రిసెప్షన్ వేడకకు తరలి వచ్చిన ప్రజానీకం

కల్లూరు, ఫిబ్రవరి 17: రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోదరుడు ప్రసాదరెడ్డి కుమారుడు లోహిత్‌రెడ్డి వివాహ రిసెప్షన్ వేడుకను ఆదివారం ఘనంగా నిర్వహించారు. పీఎస్ఆర్ ప్యాలెస్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై ఆశీనులైన వధువరులు లోహిత్‌రెడ్డి-భవానీలను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకటరెడ్డితో పాటు సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ దంపతులు, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వరరావు, ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్, సీపీ సునీల్‌దత్ ఆశీర్వదించారు. ఇంకాను రాజకీయ పార్టీల నాయకులు, అశేష ప్రజానీకం తరలివచ్చి వారిని ఆశీర్వదించారు. ఈ సందర్భంగా భారీగా తరలివచ్చిన ఆహ్వానితులకు నాన్ వెజ్, వెజ్ భోజనం ఆరగించేందేకు ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశారు. ఎలాంటి ఇబ్బందులు ఎదురు కాకుండ పెద్దఎత్తున షామీయాలను, బారికేడ్లను ఏర్పాటు చేశారు. తిరువూరు క్రాస్ రోడ్డు వైపున గల సుమారు 100 ఎకరాల స్థలంలో పీఎస్ఆర్ ప్యాలెస్‌తోపాటుగా విశాలమైన టెంట్ల కింద భోజనశాలలు, వీఐపీలకు ప్రత్యేక వసతి సౌకర్యాలు కల్పించారు. వాహన పార్కింగ్‌లు, మంత్రుల రాకను దృష్టిలో ఉంచుకుని హెలీప్యాడును కూడ ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ అంతరాయం కలగకుండా పోలీసు బందుబస్తుతో పాటుగా ప్రైవేటుగా సెక్యూరిటీని ఏర్పాటు చేశారు. ఈ వేడుక విజయవంతంగా ముగియటంతో పొంగులేటి కుటుంబం ఆనందపడ్డారు.

సరికొత్తగా పాత పంట..

- అంతరపంటగా తెల్లజొన్న సాగు
- ప్రయోగాత్మకంగా పండించిన దురదపాడు రైతు


అంతరపంటగా సాగుచేసిన జొన్న

దమ్మపేట, ఫిబ్రవరి 18: ఆరోగ్య రీత్యా ఎక్కువ మంది ఆహారంగా జొన్నలు, కొర్రలు, రాగులు, వాడటంతో ప్రస్తుతం మార్కెట్లో సంప్రదాయ పంటల ధరలు ఆకాశాన అంటుతున్నాయి. జొన్నలు, సజ్జలు, రాగులు లాంటివి మార్కెట్లో కిలో రూ.60 నుంచి రూ.70 ఉండటంతో రైతులు వాటిని పండిస్తున్నారు. దమ్మపేట మండలం దురదపాడు గ్రామానికి చెందిన రైతు శ్రీనివాసరావు తనకున్న పామాయిల్ తోటలో ప్రయోగాత్మంగా ఒక ఎకరంలో తెల్లజొన్న సాగు చేపట్టాడు. ప్రస్తుతం పంట చేతికి వచ్చే దశలో ఉంది. జొన్న కంకులు ఏపుగా ఉండి, చేను ఆకర్షణీయంగా ఉంది. పంట తీరును బట్టి బాగా దిగుబడి వచ్చే అవకాశముందని రైతు అంటున్నాడు.

గతంలో ఎలాంటి నీటివరులు లేక వర్షాధార పంటగా జొన్న, బొబ్బర్లు, కొర్రలు, రాగులు లాంటివి మెట్ట ప్రాంతాల్లో రైతులు సాగుచేసేవారు వీటికి పెట్టుబడి కూడా పెట్టేవారు కాదు. కేవలం దుక్కిచేసి విత్తనం మాత్రమే చల్లి వదిలేసే వారు. అడపా దడపా పడే వర్షాలకు ఎకరాకు 3నుంచి 4క్వింటాల వరకు చేతికొచ్చేవి. కాలక్రమేణ సంప్రదాయ పంటలు ధరలు లేక పోవటంతో చాలా మంది రైతులు వాటి సాగును మానుకున్నారు. ప్రత్యామ్నాయంగా నీటి వనరులున్న మెట్ట ప్రాంతాలలో అధికాదాయ పంటలవైపు మళ్లారు.

'డబుల్' ఇళ్లకోసం ఎదురుచూపు

- కొత్త ప్రభుత్వంలోనైనా కల నెరవేరేనా?


అసంపూర్తిగా ఉన్న ఇళ్లు

ఏన్కూరు, ఫిబ్రవరి 18: బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఎనిమిదేళ్లుగా డబుల్‌బెడ్‌రూం ఇళ్ల కోసం లబ్ధిదారులు కళ్లుకాయలు కాచేలా ఎదురుచూసినా నిరాశే ఎదురయింది. కొత్త ప్రభుత్వంలోనైనా తమ కల నెరవేరుతుందని ఆశగా ఎదురు చూస్తున్నారు. మండలంలోని తిమ్మరావుపేట గ్రామానికి 2016లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం 40 ఇళ్లు మంజూరుచేసింది. అప్పటి ఎమ్మెల్యే బానోతు మదన్‌లాల్ శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. అప్పటినుంచి ఏడాదికి ఒకసారి పనులు ప్రారంభించి కొంతమేర చేయడం ఆపడం పరిపాటిగా మారింది.

40 ఇళ్లల్లో 20 స్లాబ్ లెవల్ పూర్తికాగా మరో 20 గోడదశలోనే అసంపూర్తిగా ఉన్నాయి. ప్రధానంగా కాంట్రాక్టర్, అధికారుల సమన్వయంలోపం వల్లనే ఆలస్యానికి కారణమని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల ముందు అధికారులు హడావుడి చేసి నిర్మాణం పూర్తికాకముందే లబ్ధిదారులను ఎంపికచేశారు ఎక్కువమంది లబ్ధిదారులు గుడిసెల, రేకుల ఇళ్లల్లో బిక్కుబిక్కుమంటూ నివసిస్తున్నారు. కొంతమంది అద్దె ఇళ్లల్లో అద్దెలు కట్టలేని స్థితిలో సొంత ఇంటి కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు. అసంపూర్తిగా ఉన్న ఇళ్లల్లో ముళ్ల చెట్లు, పిచ్చిమొక్కలు నిండిపోయా యి. కుక్కలు, మేకలు పందులకు ఆవాసాలుగా మారాయి. ఇప్పటి కైనా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ చొరవ తీసుకుని డబుల్ ఇళ్లనిర్మాణం పూర్తి చేయించాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

ఒకే ఒక్కడు..

హెచ్‌ఎంకు ఐదు అదనపు బాధ్యతలు


దామోదరప్రసాద్

తల్లాడ, ఫిబ్రవరి18: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడికి ఉన్నతాధికారులు ఐదు అదనపు ఉద్యోగ బాధ్యతలు అప్పగించారు. దీంతో ఆ ప్రధానోపాధ్యాయుడు పనిభారంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ప్రజలకు ఆశించిన రీతిలో ప్రభుత్వ సేవలు అందని పరిస్థితి ఉంది. తల్లాడ మండలం అన్నారుగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న నెమ్మకంటి దామోదరప్రసాద్‌కు మండల విద్యాశాఖాధికారిగా తల్లాడ, కల్లూరు మండలాలతో పాటు ఇటీవల తల్లాడ మండలంలోని మూడు గ్రామ పంచాయితీలకు ప్రత్యేక అధికారిగా అదనపు బాధ్యతలు అప్పగించారు.

దామోదరప్రసాద్ 2012నుంచి తల్లాడ, 2022నుంచి కల్లూరు ఎంఈవోగా ఈనెల 3నుంచి తల్లాడ మండలంలోని బిల్లుపాడు, రామచంద్రాపురం, వెంగన్నపేట (గూడూరు) గ్రామ పంచాయతీల ప్రత్యేక అధికారిగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడిగా నిత్యం పాఠశాల నిర్వహణ, ఉపాధ్యాయులకు విధులు కేటాయించడం, వాటి నిర్వహణను పర్యవేక్షించడం, అన్ని తరగతుల విద్యార్థుల సామర్థ్యాలను పెంపొందించేలా ఉపాధ్యాయులను సమన్వయ పరచడం, పాఠశాలలో సౌకర్యాలు సమకూర్చడం వంటి బాధ్యతలు నిర్వర్తించాల్సి ఉంది. ఎంఈవోగా రెండు మండలాల అదనపు బాధ్యతలు అప్పగించడంతో ఆయా మండలాల్లోని అన్ని పాఠశాలలను పర్యవేక్షించడం, ఉపాధ్యాయుల సర్వీస్ విషయాలు, మధ్యాహ్న భోజన అమలు తీరు, ఎప్పటికప్పుడు పాఠశాలల్లో సౌకర్యాలు పరిశీలించి వాటి పరిష్కారానికి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయించడం వంటి పనులు చేయాలి. దీంతో పాటు పంచాయతీ ప్రత్యేక అధికారిగా గ్రామ పంచాయితీలలో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా ఎప్పటికప్పుడు తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు తరచూ గ్రామ సభలు నిర్వహించడం, వేసవి దృష్ట్యా తాగునీటి సమస్య తలెత్తకుండా చూడటం, వీధి దీపాలు, పారిశుధ్య నిర్వహణ, నర్సరీల నిర్వహణ, పంచాయితీ కార్యదర్శితో కలిసి జాయింట్ చెక్‌పవర్‌తో నిధులు డ్రా చేసి వాటికి సంబంధించి బిల్లులు, ఓచర్లు పారదర్శకంగా ఉండేలా కృషి చేయాల్సి ఉంది.

జాతీయ స్థాయిలో ప్రతిభను కనబరచాలి


పరుగుపందెం నిర్వహిస్తున్న దృశ్యం

దమ్మపేట, ఫిబ్రవరి 18: జిల్లా స్థాయి పరుగు పందెం స్థానిక గిరిజన గురుకుల కళాశాల క్రీడా మైదానంలో ఆదివారం కొత్తగూడెం జిల్లా అథ్లెటిక్స్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ పోటీలను ప్రిన్సిపాల్ జాను నాయక్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ పోటీలకు జిల్లా నలుమూలల నుంచి 60మందికి పైగా హాజరయ్యారు. ఈ సందర్భం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. భద్రాద్రి జిల్లా పేరును జాతీయ స్థాయిలో నిలపాలని ఆయన ఆకాంక్షించారు. ఈ పోటీలలో ప్రతిభ కనబరిచిన వారిని ఈ నెల 25న హైద్రాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పరుగు పందేనికి ఎంపిక చేయటం జరుగుతుందని అసోసియేషన్ జనరల్ సెక్రటరీ మహిధర్ తెలిపారు.

బతుకు చితుకుతోంది..!

బీటీపీఎస్ రైల్వే ట్రాక్ నిర్వాసితులుగా గుర్తించండి

మణుగూరులో అండర్ బ్రిడ్జి సమీప వ్యాపారుల వినతి

అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవాలని వేడుకోలు

ఉన్నత న్యాయస్థానాన్ని అశ్రయిస్తామంటున్న బాధితులు

మణుగూరుటౌన్, ఫిబ్రవరి 18: మణుగూరు మేజర్ పంచాయతీగా ఉన్నపటి నుంచి దాదాపు ముప్పై ఏళ్లకు పైగా ఇక్కడే జీవనం సాగిస్తున్నాం. నాటి నుంచి భారీ వాహనాల టైర్లకు పంచర్‌లు వేస్తూ.. జీవనోపాధిని పొందుతున్నాం. ఇప్పుడు బీటీపీఎస్ రైల్వే ట్రాక్ నిర్మాణంతో ఉపాధిని కోల్పోయే పరిస్థితి నెలకొంది. ఇకనైనా మమ్ములను నిర్వాసితులుగా గుర్తించాలి అని రైల్వే ట్రాక్ అండర్ బ్రిడ్జీ సమీపంలోని వ్యాపారులు వేడుకొంటున్నారు. రైల్వేట్రాక్ కోసం ఎంజాయిమెంట్ సర్వే చేసిన నాటి నుంచి ఇప్పటి వరకు మేము కాలు పెట్టని కార్యాలయం లేదు.. మా గోడు చెప్పుకోని ప్రజాప్రతినిధి, అధికారులు లేరన్నారు. ఇప్పటి వరకు మా గోడు


బ్రిడ్జి సమీపంలో వ్యాపార సముదాయాలు

విని సమస్యను పరిష్కరించేందుకు ఎవరు ముందుకు రావడం లేదని వాపోతున్నారు.

రైల్వేట్రాక్ నిర్వాసితులుగా గుర్తించాలి..

మణుగూరు భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్ నిర్మాణంలో భాగంగా టీఎస్ జెన్కో విద్యుత్ ఉత్పత్తికి అవసరమయ్యే బొగ్గు రవాణా కోసం రైల్వే ట్రాక్ నిర్మాణాన్ని చేపట్టింది. ఇందులో భాగంగా చేపట్టిన ఎంజాయ్‌మెంట్ సర్వేలోను తమను గుర్తించలేదని బాధితులు వాపోతున్నారు. ప్రజాప్రతినిధులకు, అధికారులకు, జెన్కో అధికారులకు ఎన్నిసార్లు వినతి పత్రాలిచ్చినా స్పందన లేదని వాపోతున్నారు. రైల్వే ట్రాక్ నిర్మాణ పనులు శరవేగంగా పూర్తి అవుతున్న నేపద్యంలో రైల్వే ట్రాక్ అండర్ బ్రిడ్జి సమీపంలోని ప్రధాన రహదారిపై ఉన్న వ్యాపారుల్లో ఆందోళన పెరిగిపోతోంది. దీంతో ఏమి చేయలేని పరిస్థితుల్లో రాష్ట్ర ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించాలనుకుంటున్నారు. ఇప్పటికైన నిర్వాసితులుగా గుర్తించాలని లేని పక్షంలో కోర్టుకు వెళ్లడమే దిక్కు అంటూ బాధితులు వాపోతున్నారు.

ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తాం

ఎస్కే మస్తాన్, బాధితుడు



నా చిన్న నాటి నుంచి ఇక్కడు పెరిగాము.. మా అమ్మ పేరుతో కొన్న ఇంటిలోనే సుమారు 30 ఏళ్లకు పైగా ఇక్కడ టైర్ల పంచర్ షాపు నిర్వహించుకుంటూ కుటుంబాన్ని వెళ్లదిస్తున్నాం. ఇప్పుడు నిర్మిస్తున్న రైల్వే అండర్ బ్రిడ్జితో


నిర్మాణంలో ఉన్న అండర్ బ్రిడ్జి

ఉపాధిని కోల్పోయే పరిస్థితి వచ్చింది. ప్రజాప్రతినిధులు, అధికారులు ఎవరూ పట్టించు కోవడం లేదు. నిర్వాసితులుగా గుర్తించని పక్షంలో విప్పలసింగారం రైల్వే బాధితులు ఆశ్రయించినట్లుగా మేము రాష్ట్ర ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తాం. మా గోడును ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా మాకు న్యాయం చేయాలి. మమ్ములను ఆదుకోవాలి.



మంత్రులకు ఘన స్వాగతం పలికిన కలెక్టర్


భట్టికి స్వాగతం పలుకుతున్న కలెక్టర్ ప్రియాంక అల

బూర్గంపాడు, ఫిబ్రవరి 18: సారపాకలోని బీపీఎల్ పాఠశాల హెలిపాడ్ వద్దకు చేరుకున్న మంత్రులకు కలెక్టర్ ప్రియంక అలా ఘన స్వాగతం పలికారు. ఆదివారం భద్రాచలం పర్యటనలో భాగంగా ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హెలికాప్టర్‌లో సారపాక చేరుకున్నారు. మంత్రులకు కలెక్టర్ ప్రియాంక అలా, ఎస్పీ రోహిత్‌రాజు పుష్పగుచ్చాలు అందజేసి స్వాగతం పలికారు. స్వాగతం పలికిన వారిలో పినపాక శాసనసభ్యుడు పాయం వెంకటేశ్వర్లు, భద్రాచలం ఆర్డీవో మంగీలాల్, తదితరులు ఉన్నారు.



స్నేహితురాలి కుమార్తె వివాహానికి సాయం


వివాహం జరుగుతున్న దృశ్యం

అశ్వారావుపేట, ఫిబ్రవరి 18: అశ్వారావుపేటకు చెందిన ఓ నిరుపేద మహిళ కుమార్తె వివాహాన్ని చేసేందుకు ఆమె క్లాస్‌మేట్స్ చేయి చేయి కలపి ఆర్థిక సహాయంతో పాటు అన్ని రకాల సహాయాన్ని చేసి వివాహాన్ని చేసిన సంఘటన శనివారం రాత్రి జరిగింది. అశ్వారావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1990-91లో పదవ తరగతి చదివిన జజ్జ జయ అనే ఆమె నిరుపేదరాలు. ఆమెకు ముగ్గురు ఆడపిల్లలు, ఒక అబ్బాయి ఉన్నారు. భర్త పదేహేనేళ్ళ క్రితమే కాలం చేసారు. అప్పటి నుండి జయ ఏదో పనిచేసుకుంటూ పిల్లలను పోషిస్తూ వస్తుంది. ఇద్దరు ఆడపిల్లల వివాహాలు అయిపోయాయి. మూడవ సంతానమైన కళ్యాణికి వివాహం కుదిరింది. ఈ వివాహం చేయడానికి ఆమెకు పెద్దగ స్తోమత లేకపోవడంతో ఆమె క్లాస్‌మేట్స్ అందరూ సుమారుగ రూ.80 వేల రూపాయల వరకు పోగుచేసుకొని కళ్యాణి వివాహం చేశారు.

మేడారం జాతరకు ప్రత్యేక సర్వీసులు


బస్సు సర్వీసును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పాయం

మణుగూరుటౌన్, ఫిబ్రవరి 18: మణుగూరు డిపో నుంచి సమ్మక్క-సారలమ్మల జాతరకు ప్రత్యేక బస్సు సర్వీలను ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ప్రారంభించారు. పట్టణంలోని సురక్ష బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన ఈ బస్సులను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. మేడారం జాతరకు వెళ్లి వచ్చే భక్తుల సౌకర్యార్థం మణుగూర ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేకంగా 30 సర్వీసులు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఆర్టీసీ ప్రయాణం సురక్షితమని, భక్తులందరు మణుగూరు డిపో కల్పించిన ఈ అవకాశాన్ని వినియోగించిన సమ్మక్క-సారాలమ్మలను దర్శించుకుని వారి కృపకు పాత్రులవ్వాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ స్వామి, ఐఎన్‌టీయుసీ బ్రాంచ్ ఉపాధ్యక్షులు కృష్ణంరాజు, నాయకులు చందా సంతోష్, కేవీ రావు, శంకర్, సుబ్బారెడ్డి, నవీన్, కోటేశ్వరరావు, వెంకట్రావ్, మధు, సురేష్, వెంటరెడ్డి, బాబ్‌జాన్ తదితరులు పాల్గొన్నారు.

మేడారం బస్సులకు పలు సౌకర్యాలు


ప్రయాణికుల ప్రాంగణాన్ని ప్రారంభిస్తున్న కోరం

ఇల్లెందుటౌన్, ఫిబ్రవరి 18: మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరకు వేళ్లే భక్తులకు ప్రభుత్వం పలు సౌకర్యలు కల్పిస్తోందని ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య ప్రకటించారు. ఆదివారం ఇల్లందు బస్ డిపో నుంచి మేడారానికి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బస్ సర్వీస్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ.. ప్రభుత్వం జాతర నిర్వహణను ఏంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని వివరించారు. భక్తులకు ఏలాంటి అసౌకర్యాలు రాకుండా, వేలాది సంఖ్యలో ఆర్టీసీ ద్వారా బస్సులను ఏర్పాటు చేసిందని వివరించారు. ఇల్లందు డిపో నుండి 135 బస్సులను కేటాయించినట్టు ప్రకటించారు. అదే విధంగా టేకులపల్లి మండల కేంద్రం నుండి 25 బస్సులను మేడారంకు ఏర్పాటు చేసినట్టు వెల్లడించారు. అంతే కాకుండా ప్రయాణ దూరాన్ని తగ్గించే విధంగా ఇల్లెందు నుంచి గుండాల మీదుగా బస్సులు నడుపుతున్నట్టు వెల్లడించారు.

జాతరకు వెళ్లే భక్తులకు సకల సౌకర్యాలు


బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కూనంనేని

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, ఫిబ్రవరి18: మేడారం జాతరకు వెళ్ళే భక్తులకు ఆర్టీసీ ప్రత్యేక బస్ సర్వీసులను ఏర్పాటు చేసిందని, భక్తులకు సకల సౌకర్యాలను అందించి ప్రభుత్వ రవాణా వ్యవస్థపై ప్రజలకు మరింత నమ్మకాన్ని కలిగించాలని కొత్తగూడెం శాసన సభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. బస్టాండ్ ఆవరణలో మేడారం జాతరకు ప్రయాణ సౌకర్యం కల్పించే ప్రత్యేక బస్సులను ఆదివారం కూనంనేని జెండా ఊపి ప్రారంభించిన అనంతరం రిబ్బన్ కట్ చేసి సేవా శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ జాతరకు 145 బస్సులు ఏర్పాటు చేసినప్పటికి భక్తుల రద్దీని పరిగణలోనికి తీసుకొని స్థానికంగా ఉండే ప్రైవేటు బస్సులను అద్దె ప్రాతిపదికన వినియోగించుకొని భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

ఇదేనా మాకు ఇచ్చే గౌరవం

భద్రాచలం, ఫిబ్రవరి 18: భద్రాచలంలో ఆదివారం నిర్వహించిన ఐటీడీఏ పాలక మండలి సమావేశానికి భద్రాచలం డివిజన్ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులను అనుమతించకపోవడంపై పార్టీ సీనియర్ నాయకులు ఎస్కే అజీమ్, కంభంపాటి సురేష్, రాజారాం, రేపాక రాంబాబులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గత పది సంవత్సరాలుగా బీఆర్ఎస్ ప్రభుత్వంలో జరిగిన పాలక మండలి సమావేశాల్లో వినతిపత్రాలకు తమకు అవకాశం కల్పించేవారని నేడు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జరుగుతున్న తొలి పాలక మండలి సమావేశంలో తమను గేటు వద్ద నిలిపివేయడంపై ఇదేనా మిత్రపక్షానికి ఇచ్చే మర్యాదా అంటూ మండిపడ్డారు. నేడు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంలో తెలుగుదేశం పార్టీ కీలకపాత్ర పోషించిందని, అలాంటి మిత్రపక్షమైన తమను గేటు వద్ద నిలిపి అవమానించడం సరైంది కాదని ఆవేదన వ్యక్తం చేశారు. రానున్న పార్లమెంటు ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అజెండా త్వరలోనే ప్రకటిస్తామని తెలిపారు.

ఉద్యమాలతోనే కార్మికులకు విముక్తి


నివాళులర్పిస్తున్న నాయకులు

అశ్వారావుపేట టౌన్, ఫిబ్రవరి 18: నిరంతరం ఉద్యమాలతోనే కార్మికులు, కర్షకులు, శ్రామికుల కష్టాలకు విముక్తి లభిస్తుందని వ్యవసాయ కార్మిక సంఘం జాతియ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ అన్నారు. కార్మికులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రభుత్వం కూలీ బంధు అమలు చేయాలని డిమాండ్ చేశారు. స్థానిక సంఘ కార్యాలయంలో వేదగిరి శ్రీనివాసారావు 4వ వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో అయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయుకులు రేపాకుల శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు, అన్నవరపు కనకయ్య, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కొక్కెరపాటి పుల్లయ్య, బత్తుల వెంకటేశ్వర్లు, నిమ్మల వెంకన్న, ముదిగొండ రాంబాబు, శెట్టి వినోద, గడ్డం స్వామి, సుగుణ, బందెల చంటి, రాజేశ్వరి, రమేష్ పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

పాల్వంచ, ఫిబ్రవరి 18: క్రీడలు మానసిక ఉల్లాసానికి, శారీరక ధృడత్వానికి దోహదపడతాయని పాల్వంచ టౌన్ ఎస్ఐ బానాల రాము అన్నారు. ఆదివారం పట్టణ పరిధిలోని నవభారత్ వద్ద నవభారత్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న నవభారత్ ప్రీమియర్ లీగ్ సీజన్ -1 క్రికెట్ టోర్నమెంట్‌కు ఆయన ముఖ్య అతిధిగా హాజరయ్యారు. టాస్ వేసి టోర్నమెంట్‌ను ప్రారంభించారు. కొద్ది సేపు క్రికెట్ ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరూ స్నేహభావంతో క్రీడల్లో రాణించాలని ఆకాంక్షించారు. అనంతరం నిర్వహకులు ఆయనను శాలువాతో ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో నిర్వహకులు దినేష్, శశి, యాకేష్, హరి, నర్సి, క్రీడాకారులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ పెన్షన్ డే వేడుకలు


రాములును సన్మానిస్తున్న దృశ్యం

బూర్గంపాడు, ఫిబ్రవరి 18: బూర్గంపాడులో ఆదివారం తెలంగాణ రిటైర్డ్ గవర్నమెంటు ఎంప్లాయిస్ యూనియన్ బూర్గంపాడు శాఖ ఆధ్వర్యంలో జాతీయ పెన్షనర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ ఉద్యోగులు కేసుపాక రాములు, వీరలింగయ్య, షబ్బీరున్నీసా బేగం, అనసూయలను ఘనంగా శాలువాలతో సన్మానించి సత్కారించారు. ఈ కార్యక్రమానికి హాజరైన బూర్గంపాడు ఎస్‌బిఐ మేనేజర్ ప్రద్యుమ్న మాట్లాడుతూ రిటైర్డ్ ఉద్యోగస్తులకు, పెన్షన్‌దారులకు కావలసిన లోన్లు మంజూరు చేసేందుకు కృషి చేస్తానని అన్నారు. వాళ్ల సమస్యల పరిష్కారానికి అవసరమైన చేయూత అందిస్తామని అన్నారు. కార్యక్రమంలో బూర్గంపాడు యూనిట్ అధ్యక్షుడు మహ్మద్ ఖాసిం అధ్యక్షత వహించగా సంఘ ప్రధాన కార్యదర్శి కేసుపాక రాములు, సీనియర్ పాత్రికేయులు తోకల మోహన్‌రావు, సహ అధ్యక్షులు విల్సన్, సువర్ణరత్నం, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎం దృష్టికి మండల సమస్యలు

అశ్వాపురం, ఫిబ్రవరి 18: డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క దృష్టికి మండలంలోని పలు సమస్యలను తీసుకెళ్లినట్లు ఎంపీపీ ముత్తినేని సుజాత తెలిపారు. ఆదివారం భద్రాచలంలో జరిగిన ఐటీడీఏ పాలక మండలి సమావేశానికి హజరైన డిప్యూటీని సీఎంను కలిశానన్నారు. ఈ సందర్భంగా అశ్వాపురం ప్రధాన రహదారి విస్తరణ పనులు, మారుమూల గ్రామాలకు రహదారి సౌకర్యం కోసం అటవీశాఖ అనుమతులు ఇప్పించుట, మండలంలో ఇతర అభివృద్ధి పనులకు నిధుల మంజూరు వంటి సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లగా అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హమీఇచ్చారన్నారు.

వేతన బకాయిలు చెల్లించాలని..

భద్రాచలం, ఫిబ్రవరి 18: ఔట్‌సోర్సింగ్ కార్మికుల 18 నెలల వేతన బకాయిలు చెల్లించాలని కోరుతూ ఆదివారం ఐటీడీఏ పాలక మండలి సమావేశం వద్ద డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు సీఐటీయు జిల్లా అధ్యక్షుడు కె.బ్రహ్మాచారి ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. పోస్టు మెట్రిక్, హాస్టల్ ఔట్‌సోర్సింగ్, ఆశ్రమ పాఠశాలల ఐదు నెలల వేతన బకాయిల కోసం డైలీవేజ్ వర్కర్లు వేతన బకాయిలు అందక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. తమ సమస్యలను పరిష్కరించకపోతే ఈ నెల 27 నుంచి నిరవధిక సమ్మె చేస్తామని పేర్కొన్నారు. దీంతో స్పందించిన భట్టి.. ఈ అంశాన్ని త్వరలోనే పరిష్కరించి వేతనాలు విడుదలయ్యేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు జిల్లా కోశాదికారి జి.పద్మ, హాస్టల్ వర్కర్స్ యూనియన్ నాయకులు జలందర్, రామస్వరూప, తిరుపతమ్మ, జయలక్ష్మి, నూక శ్యామల, లాలయ్య, సారయ్య, పద్మ పాల్గొన్నారు.

సేవాలాల్ జయంతిని జయప్రదం చేయండి.

చంద్రుగొండ, ఫిబ్రవరి 18: ఈ నెల 20న చంద్రుగొండలో నియోజకవర్గ స్థాయిలో నిర్వహించే సేవాలాల్ జయంతి వేడుకలను విజయవంతం చేసేందుకు ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే ఆదినారాయణ అధికారులను ఆదేశించినట్లు స్థానిక బంజారా నాయకులు తెలిపారు. ఆదివారం చంద్రుగొండ మండల నాయకులు దమ్మపేటలో ఎమ్మెల్యేని కలిసి సేవాలాల్ జయంతి నిర్వాహణపై చర్చించారు. అనంతరం బంజారా నాయకులు సమావేశమై ఏర్పాట్లుపై చర్చించారు. జయంతి వేడుకల నిర్వాహణ సమయంలో అధికారులకు బంజారా నాయకులు సహకరించాలని తీర్మానించారు. ఈ కార్యక్రమంలో మళోత్ భోజ్యానాయక్, ఇస్లావత్ వీరన్న, గుగులోత్ మోహన్, చౌహాన్ తదితరులు పాల్గొన్నారు.

కొవ్వూరు రైల్వే లైన్ మంజూరు పట్ల హర్షం

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, ఫిబ్రవరి 18: కొవ్వూరు రైల్వేలైన్ మంజూరు పట్ల జిల్లా బ్రాహ్మణ సంఘం సభ్యులు హర్షం వ్యక్తం చేసి కన్వీనర్ కొదమసింహం పాండురంగా చార్యులను కొత్తగూడెంలో ఆదివారం సన్మానించారు. భద్రాచలం రోడ్డు నుంచి కొవ్వూరు లైన్ మంజూరు అయినందుకు తక్షణమే పనులను ప్రారంభించనున్న నేపథ్యంలో హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వానికి, ప్రధానమంత్రి నరేంద్రమోదీ, రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్, సీఎం రేవంత్‌రెడ్డి, ఎంపీ నామా నాగేశ్వరరావులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా సాధన కమిటీ కన్వీనర్ మాట్లాడుతూ కొవ్వూరు రైల్వేలైన్ ఏర్పాటుకై ఎన్నో పోరాటాలను నిర్వహించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షులు మోహన్‌శర్మ, సభ్యులు మూర్తేశ్వరశర్మ, నాగేంద్రశర్మ, సత్యనారాయణ, శ్రీనివాస్, కుందరాజు శర్మ తదితరులు పాల్గొన్నారు.

భద్రాద్రి ఆర్టీవో బదిలీ

చుంచుపల్లి, ఫిబ్రవరి18: జిల్లాలో రవాణా శాఖ అధికారిగా గత మూడేళ్లపాటు నిర్వహిస్తున్న పి.వేణు సూర్యపేటకు బదిలీ అయ్యారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం రవాణా శాఖలో బదిలీల ప్రక్రియ చేపట్టింది. దీనిలో భాగంగా ఆర్టీవో బదిలీ కావడంతో కార్యాలయ సిబ్బంది ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా వృత్తిలో ఆయన సేవలను ప్రశంసించారు. ప్రస్తుతం జిల్లా ఆర్టీవోగా ప్రభుత్వం ఎవరినీ నియమించలేదు.

ధర్మారం దరిచేరని..

మిషన్ భగీరథ


అలంకారప్రాయంగా ట్యాంక్

దుమ్ముగూడెం ఫిబ్రవరి 18: మండలంలోని ధర్మారం గ్రామానికి మిషన్ భగీరథ నీటి సరఫరా జరగడం లేదు. 2013లో ప్రారంభమైన భగీరథ పనులు 2020లో పూర్తవగా, మండల వ్యాప్తంగా పలు ఆదివాసి గ్రామాలకు నేటికీ తాగునీటి సరఫరా సక్రమంగా అందడం లేదు. కొన్ని మారుమూల ఆదివాసీ ప్రాంతాల్లోనైతే అసలు మిషన్ భగీరథ పథకం ఉందో లేదో తెలియని దుస్థితి నెలకొంది. రూ. కోట్లాదిలతో నిర్మించిన ఈ పథకం మండలంలో పూర్తిగా విఫలమైందనే ఆరోపణలున్నాయి.

ప్రారంభమై నాలుగేళ్లు..

పథకం ప్రారంభమై నాలుగేళ్లు పూర్తవుతుండగా ధర్మారం గ్రామానికి భగీరథ త్రాగునీటి సరఫరా జరగడం లేదు. డెబ్బై కుటుంబాలు నివాసముంటున్న ఈ గ్రామానికి ట్రయిల్ రన్‌లో భాగంగా ఒకట్రెండు సార్లు మాత్రమే నీరు వదిలారు. ఇంటింటికీ వేసిన నల్లాలు వృధాగా పడి ఉన్నాయి. రెండేళ్లుగా గ్రామానికి భగీరథ ద్వారా ఒక చుక్క తాగునీరు కూడా అందలేదని స్థానికులు వాపోతున్నారు. దీంతో ధర్మారం ఆదివాసీలంతా స్థానిక చేతిబోర్లు, ఇరుగుపొరుగు వ్యక్తిగత బోర్ల పైనే ఆధారపడి జీవిస్తున్నారు. చేతిబోర్లు సైతం ఇళ్లకు దూరంగా ఉండడంతో నీటిని తెచ్చుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారు.

భగీరథ నీళ్లు రావడం లేదు

ఈ మధ్య కాలంలో భగీరథ నీళ్లు నల్లాల్లో రావడం అసలు చూడలేదని ధర్మారం బతకమ్మ కూడలిలో నివాసముంటున్న ఆదివాసీ పులి వెంకటేష్ ఆరోపించాడు. స్థానిక ట్యాంకు, నల్లాలు కేవలం మొక్కుబడిగా కేవలం అలంకార ప్రాయంగా మారాయని తెలిపాడు. ఇప్పటికైనా గ్రామానికి తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరాడు.


వృథాగా మారిన నల్లా

పట్టణానికి బస్‌షెల్టర్ కరువు

రెండేళ్లుగా ఇదే పరిస్థితి.. రోడ్డు విస్తరణలో తొలగింపు


అవస్థలు పడుతున్న ప్రయాణికులు

మణుగూరు, ఫిబ్రవరి 18: మణుగూరు పట్టణంలోని ప్రధాన సెంటర్‌లో బస్‌స్టాప్ షెల్టర్ లేక ప్రయాణికులు అనేక అవస్థలు పడుతున్నారు. దాదాపు రెండు ఏళ్లగా ఈ ఇబ్బంది తలెత్తుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. పట్టణ ప్రాంత అభివృద్ధి కార్యక్రమాల్లో బాగంగా గతంలో ఉన్న పటిష్టమైన సీసీ బస్‌స్టాప్ షెల్టర్‌ను రోడ్డు విస్తరణల్లో కూల్చి వేశారు. ఆ నాటి నుంచి నేటి వరకు ఓ చెట్టే బస్ షెల్టర్‌గా మారింది. ఎండాకాలం, చలికాలం, వానాకాలం ఇలా ప్రజలు ఆ చెట్టునే ఆశ్రయంగా చేసుకుని బస్సుల కోసం నిరీక్షించాల్సిన దుస్థితి నెలకొంది. మణుగూరు పట్టణంలోని పలు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ఇక్కడ నాడు షెల్టర్ ఏర్పాటు చేసినా.. నేడు ఎవరూ ముందుకు రాలేని పరిస్థితులు నెలకొన్నాయి. వేలాది సంఖ్యలో ఈ ప్రాంతానికి చేరుకుని ప్రయాణాలు సాగించడం జరుగుతోంది. ఈ దఫా ఎండలు బాగా ఉంటాయనే సరికి ప్రయాణికుల్లో ఆందోళన మొదలైంది. ఓ చెట్టే బస్‌స్టాప్ షెల్టర్‌గా ఉండటంతో పెరుగుతున్న ప్రయాణికుల సంఖ్యకు ఆ చెట్టు నీడనివ్వలేని పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా ఆర్టీసీ లేదా ఎవరైనా స్వచ్ఛందగా టీడీపీ సెంటర్‌లో బస్ షెల్టర్ ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

అయోధ్య రామయ్యను దర్శించుకున్న భక్తులు


అయోధ్య రామమందిరంలో ఆళ్లపల్లి భక్తులు

ఆళ్లపల్లి, ఫిబ్రవరి 18: అయోధ్య రామమందిరంలోని బాలరాముడుని ఆళ్లపల్లి మండల భక్తులు ఆదివారం దర్శించుకున్నారు. రాముడి దర్శనం కోసం ప్రత్యేకంగా రైల్వేశాఖ భద్రాచలంరోడ్డు(కొత్తగూడెం) నుంచి అయోధ్యకు ప్రయాణ సౌకర్యం ఏర్పాటు చేసింది. దీంతో ఆళ్లపల్లి మండలం నుంచి 20 మంది భక్తులు రెండు రోజుల క్రితం వెళ్లి.. ఆదివారం రాముడిని దర్శించుకున్నారు.

వైద్య శిబిరానికి అనుహ్య స్పందన

బూర్గంపాడు, ఫిబ్రవరి 18: భద్రాచలం పట్టణంలోని నేతాజీ హస్పిటల్, సహస్ర చిల్డ్రన్స్ హస్పిటల్ ఆధ్వర్యంలో సారపాకలోని పద్మావతి డయాగ్నస్టిక్ సెంటర్‌లో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని ప్రగతి విద్య సంస్థల చైర్మన్ సానికొమ్ము బ్రహ్మారెడ్డి ప్రారంభించారు. బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ పేద ప్రజల కోసం సారపాకలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. సహస్ర చిన్న పిల్లల హస్పిటల్ వైద్యులు డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి, నేతాజీ హస్పిటల్ ఛాతి వైద్య నిపుణులు డాక్టర్ జగదీష్ రోగులను పరీక్షించి ఉచితంగా మందులను ఆందజేశారు. ఈ సందర్భంగా వైద్యులు వివిధ రోగాలు, అవి వ్యాపించే విషయాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. వైద్య శిబిరానికి వివిధ ప్రాంతాల నుంచి భారీగా తరలివచ్చారు. కార్యక్రమంలో ఆసుపత్రి నిర్వాహకులు నరసింహరెడ్డి, శ్రీనివాసరెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, మురళి తదితరులు పాల్గొన్నారు.